# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా
ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267
web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

సంపాదక వర్గము
డి.జె. బాలకృష్ణ లాల్
డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి
మిస్. పి. ఇందిరాదేవి
డా॥ యమ్. స్వర్ణముఖి

సంపుటి 36 సంచిక 2
పేజీలు 40
అక్టోబర్ 2016

5సం॥ల చందా రూ. 250
2సం॥ల చందా రూ. 120
సంవత్సర చందా రూ. 60
విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL

**ఈ సంచికలో ............................ ....... పేజీ**

భద్రవాక్యం ........ 2
శ్రీబాబూజీ ఉవాచ........ 3
అమ్మమాట........ 6
అష్టాంగ యోగము........ 8
ఆవేదన ........ 10
ఊరకనే ఉండటానికి అభ్యాసం చేస్తున్నారు........ 11
యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ........ 12
మధురకవి - గురుభక్తి........ 15
పుట్టు భోగులము మేము........ 17
శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా మహిమ 18
యోగవాశిష్ఠము ........ 20
పూలమ్ముకవాని యిల్లుచేరిన పల్లె పడుచులు ......22
హైదరాబాద్‌శాఖ కార్యక్రమాలు........ 23
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........ 24
పరిప్రశ్న ........ 25
విష్ణువు ఎక్కడ? ........ 27
అనిరుద్ధునిపై గణపతి విజయం ........ 28
జ్ఞాని ........ 30
శ్రీకృష్ణకర్ణామృతము........ 31
గీతాధ్యయనమ్ ........ 33
జమదగ్నిమహర్షి ........ 35
సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర......37
విష్ణు కథలు- సూరదాస్ ........ 39

# భద్రవాక్యం

\- పరాశర ప్రసాద్

తస్మై సహోవాచ పితామహశ్చ ।

శ్రద్ధాభక్తి ధ్యానయోగాదవైహి ॥ (కైవల్యోపనిషత్ - 2శ్లో॥)

పితామహుడైన బ్రహ్మదేవుడు అశ్వలాయన మహర్షికి, బ్రహ్మవిద్యను శ్రద్ధా భక్తి ధ్యాన యోగముల ద్వారా తెలుసుకొనవలెనని ఆదేశించటమే ఈ శ్లోకము యొక్క భావము.

అయితే అర్హత గల శిష్యుడు సమర్థుడైన గురువును ఆశ్రయించి నప్పుడు, శిష్యుని బుద్ధిలో వున్న సృజనశక్తిని వుత్తేజపరచి, ఆత్మ సాక్షాత్కారమును పొందేటట్లు సహాయపడటం తథ్యం. ఆత్మ సాక్షాత్కారానికి సాధనము శ్రద్ధ, భక్తి, ధ్యాన యోగప్రక్రియలను అభ్యసించ వలసినదిగా ఆదేశించటం గమనించదగినది.

భావగర్భితమైన యీ శ్లోకాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే, సద్గురు మూర్తి ఆదేశానుసారము వారు అందించిన గురువాక్యాలను మననం చేసి, వాటిలోని గంభీరమైన భావాలను అర్థం చేసుకుని, జీర్ణించుకోగల బుద్ధినే 'శ్రద్ధ' అంటారు. కాబట్టి శ్రద్ధ అనేది బుద్ధి కార్యమన్నమాట. ఇంక సాధకునిలో దాగివున్న ప్రేమను ఒక ఉన్నత ఆదర్శము వైపు మరలించి, ఆ క్రియ ద్వారా పొందే వికాసమే 'భక్తి' అని పిలువబడుతుంది. భక్తి అనేది హృదయమునకు సంబంధించినది. మానవ హృదయము ప్రేమకు నిలయమైనప్పుడే 'భక్తుడు' అనిపించుకుంటాడు. 'ధ్యానము' అనేది మనోబుద్ధుల సమైక్య ప్రక్రియగా భావించవచ్చు. శాస్త్రములో ప్రస్తావించిన విషయాలను గురువాక్యముతో సమన్వయపరచి విచారణ ద్వారా దాని యొుక్క సత్యత్వము యొుక్క అనుభూతియే ధ్యానయోగము.

బ్రహ్మవిద్య బుద్ధికి, మనస్సుకి, ఇంద్రియాలకి అందేది కాదని, పితామహుడైన బ్రహ్మదేవుడు ముందుగానే ప్రస్తావించటం గమనించాలి. మనస్సుకి, బుద్ధికి శాస్త్రజ్ఞానము అందవచ్చుగాని, తత్త్వము వాటికి అతీత మైనది. అందువలనే తత్త్వము అనేది సాధకునిలో వున్న సహజ అంతరజ్ఞానము. అది అనుభవించ దగినదేగాని, ఏ ప్రక్రియకి అందేది కాదు. సద్గురుమూర్తి దానిని అనుభవించే మార్గాన్ని చూపించ గలుగుతారు. మరి సాధకుడు ఆ మార్గంలో పయనించాలి కదా!

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధచేస్తూ "మానవుడు తన జన్మ రహస్యమేమిటో, తన గమ్యస్థానమేమిటో, అసలు తానెవరో తెలుసుకోనకుండా తనలోనే అంతర్గతంగా దాగి ఉన్న ఆరుగురు దొంగలు నిరోధిస్తున్నారు. తనలోని ప్రజ్ఞ అనే రత్నాన్ని దొంగిలించి దానిని గుర్తించకుండా అడ్డుపడుతున్నారు. వారే కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు. ఈ ఆరుగురు దొంగలలో అందరినీ జయించవచ్చు కానీ మాత్సర్యము అనే దొంగని జయించడం మాత్రము దుర్లభము. సాధకుడు ఎంత జాగ్రత్త వహించినా మాత్సర్యానికి దాసుడై చతికిల పడిపోక తప్పదు సుమా! మాత్సర్యం ప్రతి సాధకునిలో బయటికి కనబడకుండా మార్బుల్‌మీది నాచులాగా మనస్సంతా అంతర్వాహినిగా వ్యాప్తిచెంది ఉంటుంది. అది గురుసాన్నిధ్యంలో కూడా సాధకునికి ప్రతి బంధకమై, నేనున్నాను సుమా! అని హెచ్చరిస్తుంది.



మాత్సర్యము అంటే మీలో పేరుకుపోయిన ఈర్ష్య, అసూయ, ఓర్వలేనితనము, అసహనము. ఈ నాల్గు గుణాలు ఒకేరకంగా కన్పించినా వాటియొక్క ప్రభావం మానవుని ప్రవర్తన మీద విభిన్న రీతులలో వుంటుంది. సాధకుణ్ణి మాత్సర్యం ఏరకంగా ప్రభావితం చేస్తుందో మీకు కొన్ని ఉదంతములను వివరిస్తాను.

సద్గురుమూర్తి ఎవరైనా ఒక శిష్యుడు చేసిన పనిని ప్రశంసించారనుకోండి, మిగిలినవారికి ఈర్ష్య కలుగక తప్పదు కదా! అంతేకాదు ఈర్ష్యతో శిష్యులు వ్యర్థ ప్రసంగములు కూడా చెయ్యవచ్చు. ఇంత మాత్రం పని మనం చేయలేమా? అని ఎన్నో లేనిపోని మాటలు దొర్లుతాయి. ఇటువంటి వ్యర్థ ప్రసంగాలు గురుపుత్రుడై ఉండి చేయటం న్యాయమేనంటారా! ఆలోచించండి. ఈ విషయాన్ని అలా ఉంచండి. ఇంకొక సంఘటన చెబుతాను. సద్గురుమూర్తి ఒక సాధకునికి అప్పగించిన బాధ్యత సక్రమంగా నెరవేర్చినందుకు ప్రశంసించి అతనితోపాటు ఇంకొక సాధకుడు కూడా సద్గురుమూర్తి ఆశీస్సులకు అర్హత పొందితే అసూయ కలుగకమానుతుందా? ఆలోచించండి. నేను ఇంకొక విషయం గమనించాను. ఒక్కొక్కసారి అనుకోకుండా ఎవరో ఒక శిష్యుని భుజం

మీద చెయ్యివేసి ఆ శిష్యునితో ముచ్చటించాననుకోండి. నాకు అంతర్గతంగా ఏ రకమైన భావము ఉండదుకదా! నాకు శిష్యులందరూ సమానమే. ఒకరు ఎక్కువ, ఇంకొకరు తక్కువ అనే భేదభావం ఉండదు. అది మీకందరికీ తెలిసిన విషయమే. ఎవరి అవసరం వచ్చినపుడు వారితో నేను సంభాషిస్తాను. మరి సాధకునికి ఈ విషయాలన్నీ తెలిసినా ఓర్వలేనితనము కలుగకుండా ఉంటుందంటారా? సందేహమే. వీటన్నింటికన్నా మించినది ఇంకొకటి ఉంది. దానికి ఎంతటి సాధకుడైనా తలవంచక తప్పదు. కేవలం గురు అనుగ్రహంచేతనే దానిని అధిగమించగల్గుతారు. ఉదాహరణకి మీరెవరైనా నిర్వహించే బాధ్యతని కారణం ఏదైనా కావచ్చు. వేరొకరికి అప్పగించాను అనుకోండి. మీలో అసహనమనేది తప్పక చోటుచేసుకుంటుంది. ఇదిమాత్రం ఛాలెంజ్.

మాత్సర్యము అనేది జన్మాంతరవాసన. పరిపక్వస్థితిలో ఉన్న సాధకుడికి మాత్సర్యము నుండి ఏ రకమైన భయమూ ఉండదు. సాధకుడు పరిపక్వస్థితిలో ఉన్నట్లు గుర్తించడం ఎలాగు? ఆ విషయాన్ని ఎవరో చెప్పనవసరంలేదు. తనకే అవగాహన అవుతుంది. పరిపక్వస్థితిలో ఉన్న సాధకుని ఎవరైనా దూషించారనుకోండి. అతనిలో ప్రతీకారవాంఛ వుండదు. అంతేకాదు స్నేహితులో, బంధువులో ఎవరైనా ఇతరులు నీవు ఇంద్రుడవూ, చంద్రుడవూ అనిపొగిడితే తాను పొంగిపోడు. స్నేహితులెవరైనా ప్రాపంచిక వ్యవహారాలకు సంబంధించిన వ్యర్థప్రసంగాలు చేసినప్పుడు దానికి ఇష్టపడడు. అటువంటి సందర్భం తటస్థపడితే ఆ ప్రదేశము నుండి ఎప్పుడు లేచిపోదామా అని తగు ప్రయత్నం చేస్తాడు. మహాత్ముల బోధాశ్రవణానికి ఎంతో ఆసక్తి కనబరుస్తాడు. మరి అటువంటి సాధకుడు మాత్సర్యానికి భయపడాల్సిన పని ఏముంది? అతని పరిపక్వ హృదయంలో మాత్సర్యానికి తావులేదు. చీకటిలో ఏ వస్తువూ గోచరించదు కదా! వస్తుజ్ఞానం పొందాలంటే ప్రకాశం కావాలి. కాబట్టి మాత్సర్యాన్ని అధిగమించాలంటే మీలో అజ్ఞానమనే చీకటి అదృశ్యమై, జ్ఞాన తేజస్సు పెంపొందాలి. గురుబోధాశ్రవణం చేయుటయేకాక మననం చేయాలి. ఎప్పటికప్పుడు తన మనస్సుని పరీక్షించుకోవాలి. అంతేకాదు మనస్సుని తన అదుపులో ఉంచుకోవాలి. జాగ్రత్, స్వప్న, సుషుప్తి ఈ మూడు అవస్థలలోనూ శ్రవణం చేసిన గురుబోధను మననం చేసుకుంటే మనస్సు నీ అదుపులో ఉంటుంది. మననం చేసినకొలదీ అజ్ఞానమనే మరపు తొలగిపోతుంది.

నా గురుదేవుడే సర్వశక్తి సంపన్నుడు, సర్వప్రకృతికీ ఆధారభూతుడు అనే భావన ఆరూఢమై, ప్రకృతిలో దేనికీ స్వయం సత్తాలేదు, సద్గురుమూర్తి అనుజ్ఞలేనిదే జగత్తులో ఏ ఒక్క వస్తువుకు మనుగడలేదు, అనే విచారణ అనుక్షణం చేయాలి. ఇక్కడ మీకొక ఉదంతం చెబుతాను. మీరు బజారుకువెళ్లి మీకెంతో ఇష్టమైన పండ్లు తెచ్చుకుంటారు. వాటిని చాలా జాగ్రత్తగా ఎవరికీ ఇవ్వకుండా దాచిపెట్టారనుకోండి. ఆ పండ్లు కుళ్లిపోయాయి. వాటిని తినగల్గుతారా? వెంటనే వాటిని పారవేస్తారుకదా! మరి కుళ్లిపోయిన పండును పారవేయటం త్యాగము లేక వైరాగ్యము అనిపించుకుంటుందా? అలాకాకుండా ఈ చరాచర జగత్తులో ఏ వస్తువైనా నిష్ప్రయోజనమైనదే. పరిణామము చెంది నశించేదే. కాలగమనంలో దాచినపండు ఎలా కుళ్లిపోయిందో జగత్తులో ఏ వస్తువైనా అంతే అనే విషయాన్ని తద్విచారణ ద్వారా తెలుసుకొనగల్గడమే నిజమైన వైరాగ్యము. అటువంటివాడే పరిపక్వ సాధకుడు. వాడి హృదయంలో మాత్సర్యానికి స్థానం ఉండదే! వసిష్ఠులవారికి నూరుగురు సంతానం. వారు ఎలా ఉన్నారు? ఎక్కడ ఉన్నారు? అని వారిగురించి ఎన్నడూ చింతించలేదు. అది మహాత్ముల స్థితి.

కానీ జీవదృష్టి ఉన్న వారి స్థితి భిన్నంగా ఉంటుంది. వారు 'జీవాత్మ వేరు, పరమాత్మవేరు' అని తర్కిస్తారు. ఒక నదీ ప్రవాహానికి అడ్డుగా మధ్యలో ఒక కొండ ఉందనుకోండి, ఆ నది రెండు పాయలుగా చీలిపోయి ప్రవహిస్తుంది కదా! కానీ కొండకి ఆవల మళ్లీ రెండుపాయలు ఏకమై ఒకే నదిగా ప్రవహిస్తుంది. దీనిని అర్థం చేసుకోండి బంగారం నుంచి తయారైన నగ బంగారానికి భిన్నంగా ఉండదు కదా! దానిని బంగారునగ అంటారు. అయితే 'మాయ' అనే పొర అడ్డుగా నిలిచి జీవభ్రాంతిచేత జీవాత్మ వేరు. పరమాత్మవేరు అని భావిస్తారు. పసుపుపచ్చ అద్దాలున్న కళ్లజోడు పెట్టుకుని చూస్తే సర్వప్రకృతి పచ్చగా కనబడుతుంది. ఇక్కడ దోషం కళ్లదీ కాదు, ప్రకృతిదీకాదు, దృష్టిలో దోషం ఉంది. అలాగే జీవదృష్టి లేక జీవభ్రాంతి అనేది భావనలో మార్పును తీసుకువస్తోంది. అటువంటి భావనే మాత్సర్యానికి దోహదం చేస్తోంది" అని అన్నారు.

# అమ్మ మాట

- జపమాల ప్రసాద

## మనస్సు లయమైతే బ్రహ్మానంద ప్రాప్తి

గురు తత్త్వంలో భయానికి తావులేదు. గురుపరమాత్మ అనంత ప్రేమ స్వరూపుడు. ఆ ప్రేమను పొందటానికి భౌతికమైన ద్రవ్యంతో సంబంధం లేదు. సర్వులూ అర్హులే! గురువాజ్ఞను ఆచరణలో పెట్టి, గురు లక్ష్యార్థముపై మనస్సు నిలిపితే ఆత్మ సాక్షాత్కారమై, సద్గురు ప్రేమను పూర్తిగా పొందగలము. స్వామి పూజకు ఏ పూజా ద్రవ్యాలతో పనిలేదు. మనస్సనే పుష్పాన్ని అర్పిస్తే భగవంతుడు తప్పక రక్షిస్తాడని శ్రీబాబూజీ ఎప్పుడూ చెబుతుండేవారు.



ఆత్మవస్తువు సాక్షాత్కారానికి అడ్డుగా నిలిచేది కల్మషమైన మనస్సు. మనస్సును శుద్ధమైనది, అశుద్ధమైనది అని రెండు రకాలుగా ఉపనిషత్తులో వర్గీకరించారు. కామ సంకల్పాలతో కూడినది అశుద్ధ మనస్సు. కామ రహితమైనది శుద్ధ మనస్సు. మానవుడిని ఇహ లోకంలో బంధించటానికి మనస్సే కారణం. నారికేళంలో పువ్వు పెరిగే కొలదీ నీరు హరిస్తుంది. అలాగే విశ్వాసం ప్రగాఢంగా పెరిగేకొలదీ, కామ సంకల్పాలు హరించి, మనసు బ్రహ్మానందంలో లీనమై పోతుంది.

శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు శుద్ధమైన తన మనస్సును బ్రహ్మానందంలో ఓలలాడించారు. కావేరీ తీరంలో ఆ మహనీయుడు శరీర స్పృహ లేకుండా ధ్యానంలో నిమగ్నమై వున్నాడు. ఆయనపై ఇసుక మేటలు పేరుకుపోయాయి. కానీ ఆ పరబ్రహ్మ స్వరూపుడికి దేహదృష్టి లేదు. అలా చాలా సంవత్సరాలు గడిచాక, భవన నిర్మాణం నిమిత్తం ఇసుక కోసం వచ్చిన వారు గునపాలతో త్రవ్వసాగారు. గునపానికి తడి తగిలింది. తీరా చూస్తే అది రక్తం ! ఇసుకను జాగ్రత్తగా తొలగించి చూస్తే

రక్తం ఉబికి వస్తున్న శిరస్సు కనిపించింది. తలకు గునపపుపోటు తగిలి రక్తం స్రవిస్తున్న శ్రీ సదాశివ బ్రహ్మేంద్రులవారు చెక్కుచెదరని సమాధి స్థితిలో ఉన్నారు. అది మనోలయమైన సమాధి స్థితి.

మరో సందర్భంలో, సదాశివబ్రహ్మేంద్రులవారు సదాశివుని కీర్తిస్తూ శిష్యబృందంతో కలిసి వెడుతున్నారు. ఆ ప్రాంతపు నవాబు గుడారం వైపు నుంచే వారు వెడుతున్నారు. అహంకారియైన ఆ నవాబు ఆ భక్తుడు తనకు నమస్కరిస్తాడని ఆశించి, ఆయనకు ఎదురుగా వెళ్ళాడు. అయితే సదాశివబ్రహ్మేంద్రులవారికి బ్రహ్మం తప్ప యితరమేదీ గోచరించదు. నవాబు ఆగ్రహించి, ఆ భజన చేస్తున్న చేతులను నరికి వేయమని తన భటులను ఆజ్ఞాపించాడు. వారు నరికి వేశారు.

దేహస్ఫురణ లేని ఆ మహానీయుడు తెగిన చేతులు క్రింద పడినా కూడా, తిరిగి చూడకుండా, నామస్మరణలో, దివ్య ప్రకాశంతో తేజరిల్లుతూ ముందుకు సాగిపోయాడు. దిగ్భ్రాంతి చెందిన నవాబుకు పశ్చాత్తాపం కలిగి, తెగిన ఆ చేతులను తీసుకుని, క్షమించమని వేడుకుంటూ వెంట పరుగెత్తసాగాడు.

ఆ మహానీయునికి సాష్టాంగ నమస్కారం చేసి, తాను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం విధించమని వేడుకున్నాడు. చేతులు యథాస్థానంలో పెట్టమని స్వామి చెప్పారు. సదాశివుని కృపతో అవి తిరిగి అతుక్కు పోయాయి!

గురుతత్త్వంలో భయానికి తావులేదు. భయభీతుడైతే మాయ ఆవరించినట్లే. అర్జునుడు కురుక్షేత్ర సంగ్రామ ఆరంభంలో మాయ, భయ, మోహ, విషాదాలకు గురి అయినాడు. అప్పుడు గీతాచార్యుడు కరుణించి, తన విశ్వరూపాన్ని చూపించి, అర్జునుని కార్యోన్ముఖునిగా చేశాడు.

మనస్సును కామ రహితంగా చేసుకుని, బృందావనంలో అపూర్వ విధిగా ప్రకాశిస్తున్న సద్గురుదేవులను స్మరిస్తూ, భక్తి పారవశ్యంతో వైరాగ్యంతో ఆత్మానందాన్ని ఆస్వాదించాలి.

అట్టి గురుపాదుకలు అఖండ భక్తి జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదించి మనందరినీ సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# అష్టాంగ యోగము

- పరాశర ప్రసాద్

అంతఃకరణము నిర్మలమై, నిశ్చలమై, వృత్తిరహితమై, విషయాదుల యందు యిచ్ఛ లేకుండటమే సమాధి. దానిని సాధించ టానికి అవలంబించే యోగమార్గము ఎనిమిది అంగములతో కూడినది. అవి - 1. యమము, 2. నియమము, 3. ఆసనము, 4. ప్రాణాయామము, 5. ప్రత్యాహారము, 6. ధ్యానము, 7. ధారణము, 8. సమాధి.

యమము - అనేది అహింస, సత్యము, బ్రహ్మచర్యము మొదలగు అంశలతో కూడినదిగా శాస్త్రము తెలియజేస్తోంది. కేవలము అహింస యమము కాదు. సాధకుడు తన వాక్కుతోగాని, క్రియద్వారా గాని ఎవరి మనస్సును నొప్పించక పోవటమే యమముగా పరిగణించాలని శ్రీగురుదేవులు హెచ్చరించేవారు.

నియమము - అంటే శౌచము, తపస్సు, ఉపాసన మొదలగు వాటితో కూడినదిగా శాస్త్రము తెలియజేస్తోంది. అయితే కేవలం శౌచము, ఉపాసన వంటి క్రియలకన్న అంతఃకరణ విషయాదులయందు అనాసక్తి కలిగి ఉండటమే యమమని శ్రీగురుదేవులు వచించటం గమనార్హం.

ఆసనము - అంటే సద్గురుదేవులు బోధ చేస్తూ ఏస్థితి యందు సాధకునికి బ్రహ్మచింతన సుఖముగా ఉంటుందో ఆ ఆసనము సుఖమైనది, శుభప్రదమైనదిగా పేర్కొనటం జరిగింది.

ప్రాణాయామము - పూరకము, రేచకము, కుంభకము అను మూడు ప్రక్రియలతో కూడినదిగా శాస్త్రము తెలియజేస్తోంది. నాశిక యొక్క వామద్వార మూలకమైన ఇడ అనే నాడి సహాయంతో వాయువును పూరించటం పూరకము అనబడుతుంది. దక్షిణ ద్వార మూలకమైన పింగళ నాడి సహాయంతో వాయువును విడవటం రేచకం అనబడుతుంది. సుషుమ్న నాడి సహాయంతో వాయువును అడ్డగించటం కుంభకం అని పిలువబడుతోంది.

ప్రాణాయామం గురించి శ్రీగురుదేవులు బోధ చేస్తూ ప్రణవోచ్ఛారణ చేసే సాధకుడు ప్రత్యేకంగా పూరకము, రేచకము, కుంభకము ప్రయత్న పూర్వకంగా చేయవలసిన పనిలేదు. అప్పుడు అవి సహజ ప్రక్రియలుగా ఉంటాయి అన్నారు.

ప్రత్యాహారం - అంటే ఇంద్రియ నిగ్రహము. సర్వము బ్రహ్మమని భావించినప్పుడు ఇంద్రియములు విషయాదులయందు చలించవు కదా అని సద్గురుదేవులు వచించారు. అన్ని విషయాదులయందు ఆత్మస్వరూపమును దర్శించటం అలవరచుకోవాలి అన్నారు.

ఇంద్రియ నిగ్రహము అంటే బలవంతంగా యింద్రియాలను అదుపులోపెట్టటము కాదు అని సద్గురుదేవులు హెచ్చరించేవారు. అలా చేస్తే సమయం వచ్చినప్పుడు స్ప్రింగ్‌ను బలవంతంగా నొక్కిపెట్టి వదిలి పెడితే ఎంత ప్రమాదమో యిది కూడా అంతే. కాబట్టి ఇంద్రియాలను ఎంతవరకు అవసరమో అంతవరకే వినియోగించుకోవాలి. దానినే ఇంద్రియ సంయమనము అంటారని శ్రీ గురుదేవులు చెప్పేవారు.

ధ్యానము ధారణ - ప్రక్రియలలో అంతఃకరణము నిర్మలంగా, నిశ్చలంగా ఉంచటం, దానిని సాధించటానికి శ్రవణం చేసిన గురుబోధను మననం చేయాలి. అంతేకాదు మననం ఎడతెగక నిరంతరం కొనసాగించాలి. విచారణ చేయాలి. 'నేను ఎవరు? ఈ సృష్టి ఎలా వచ్చింది? ఈ సృష్టి కార్యానికి కారణం ఏమిటి? కర్త ఎవరు? నిరంతర మానసిక విచారణ చేయాలి.

ఆ విచారణ ద్వారా సత్యశోధన జరుగుతుంది. ఆ స్థితి ద్వారా అనాత్మ తిరస్కారము కలిగి, నిత్యానిత్య వస్తు వివేకము ఆరూఢమై, అంతఃకరణ ఏకాగ్రతకు దారి తీస్తుంది. అదే సమాధి.

## శ్రద్ధాంజలి

శ్రీబాబూజీ ప్రియతమ భక్తులు, గత కొద్ది కాలం నుండి ఆశ్రమ స్థిరనివాసులు అయిన మంతెన వెంకటరాజు గారు 26-8-2016 శుక్రవారం నాడు శ్రీసద్గురు సాయుజ్యం పొందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు. శ్రీ సద్గురుదేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక!

వీరి కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాము.

# ఆవేదన

- రాధ

హే కృష్ణా!

ఈ శరీరానికి బదులు మంచి గంధపు చెట్టుగా పుట్టినా బాగుండేది. నీ శరీరాన్ని అలరించేదాన్ని!

అంతెందుకూ, ఒక చిన్న జాతిరాయిగా పుట్టినా, నీ కిరీటంలోనో, హారంలోనో నాకు చోటు దొరికి నిన్నొదలకుండా వుండే భాగ్యం దొరికేది కదా!

నీ పింఛంలో ఒక నెమలి కన్నునైనా బాగుండును. నీతో వుండి పోయేదాన్ని!

ఈ పట్టుపురుగు తినే ధూళికణంగా మారినా నా జన్మ చరితార్థ మయ్యేది. నీవు ధరించే పట్టు వస్త్రంలో ఒక పోగుగా నాకు స్థలం ఉండేది!

నా శరీరంలో రక్తం బదులు లాక్షారసం ప్రవహించినా బాగుండేది. నీ పాదాలను అలంకరించే అవకాశం కలిగేది!

ఈ శరీరానికి బదులు వెదురు చెట్టునై పుట్టినా బాగుండేది. మురళినై నీ అధరామృతాన్ని గ్రోలుతూ వుండే అవకాశం వుండేది.

ప్రభూ! నీకూ మురళికి ఎందుకింత అవినాభావమో తెలిసింది. అది నీ తత్త్వానికి సంకేతం. మానవులకు మల్లేనే దానికి నవరంధ్రాలు వున్నాయి. గొట్టం అనబడే శరీరం వున్నది. కాని దానికి మానవులకు ఒక తేడా కూడా వుంది. ఆ వేణువులో ఏమున్నది? అంతా శూన్యం. నేను, నాది అనేదేదీ తనలో వుంచుకోదది!

గోపికలకు నీవంటే ప్రేమ. నిన్ను వారు వదలలేరు. నీ అధరామృతం వారికే స్వంతం కావాలన్న తపన వున్నది వాళ్ళకి!

మురళి అలా కాదు. దానికి ఏదీ అక్కరలేదు. అన్నీ అందరికీ పంచి యివ్వటమే దాని లక్షణం. నీ మధురాధరాల నుండి వచ్చిన మధుర మంద్ర గానాన్ని కూడా తనలో వుంచుకోవాలనుకోదు ఆ వేణువు. స్వార్థం లేదక్కడ. త్యాగానికి పరాకాష్ఠ మాత్రమే వున్నది. అదే ప్రభూ! నీకు నచ్చేది. అందువల్లనే అది గోపికల కంటే కూడా ప్రియతమమై నీ నామము ముందు చేరి నిన్ను వంశీమోహనుణ్ణి చేసింది. నీకు అత్యంత ప్రియతమమై నీ బొడ్డులోనే కాపురం పెట్టింది. నీవు నన్ను విడువకుండా కావాలంటే నేనూ అలా కావాలి. నన్ను అలా ఆశీర్వదించు ప్రభూ!!

# ఊరక ఉండటానికి అభ్యాసం చేస్తున్నారు!

- పి. పుల్లయ్య

ఒకరోజు రమణ మహర్షి సన్నిధిలో భక్తులంతా ధ్యాననిమగ్నులై కూర్చుని వున్నారు. అంతా ప్రశాంతంగా వున్నది. ఇద్దరు ఆంగ్లేయులు అక్కడకి వచ్చారు. వారు అంతా అలా మౌనంగా కూర్చోవటం చూసి ఆశ్చర్యంగా, ఒకరి నొకరు ప్రశ్నించుకుంటున్నారు......

ఒకరు - వారంతా ఏం చేస్తున్నారో చెప్పు? **(Say what are they doing?)**

మరొకరు - వారు వూరకనే వున్నారు. **(They are keeping quiet.)**

వీరిద్దరూ ఇలా మాట్లాడుకుని వెనుతిరిగి వెళ్ళిపోయారు. రమణమహర్షి వీరి సంభాషణ విన్నారు కాబోలు! అందరి వంకా చూస్తూ .........

ఆ రెండవ వ్యక్తి యిచ్చిన జవాబు సరిగా లేదు. దానికి సరియైన జవాబు ఏమటింటే ............

'వారు వూరక వుండలేదు. వారు వూరకనే వుండటానికి అభ్యాసం చేస్తున్నారు.' **(They are not keeping quiet. But they are learning to keep quiet.)**

ఓహో! భగవానుల జవాబు ఎంత చక్కగా వున్నది! అవును! మనస్సులో ఒక్క సంకల్పం కూడా లేకుండా వుండటమే వూరక వుండటం అంటే! అది ఒక జ్ఞానికి మాత్రమే సాధ్యమవుతుంది. సాధకులంతా మనస్సులో సంకల్పాలు లేకుండా వుండటం కోసమే కదా అభ్యాసం చేసేది!

భగవానులు ఎంత సరళంగా, చమత్కారంగా చెప్పారు యీ యోగ రహస్యాన్ని!! - అని అందరూ అనుకున్నారు.

# యువతరానికి శ్రీమాతాజీ ఉద్బోధ

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

మాతాజీ - ఒక గురువుగారి దగ్గర ముగ్గురు శిష్యులుండేవారు. ఆ గురువుగారు నల్లని బొగ్గులో తెల్లటి పదార్థమున్నదని, దాన్ని చేసి తీసుకు రండి అని చెప్పి వారికి బొగ్గుముక్కలనిచ్చి పంపాడు. ఒక శిష్యుడు కృష్ణానదీ స్నాన ఘట్టానికి వెళ్ళి, ఆ పవిత్ర నదీ జలాలతోనూ, పంచామృతాలతోనూ బాగా రుద్ది ఎన్ని సార్లు కడిగినా, ఆ పరిసరాలను నల్లగా మార్చిందేకాని, బొగ్గు మాత్రం తెల్లబడలేదు. ఆ బొగ్గునే ఎండబెట్టి తిరిగి గురువుగారికి తీసుకు వచ్చి యిచ్చాడు. రెండవ శిష్యుడు సర్వ నదీజాలలతో ఆ బొగ్గును శుద్ధి చేయటానికి ప్రయత్నించి, విఫలుడై తిరిగి వచ్చాడు.



మూడవ శిష్యుడు గురువుగారు చెప్పిన బోధను బాగా విచారణ చేశాడు. అతనికి 'జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం' అని గురువుగారు చెప్పిన వాక్యం జ్ఞాపకం వచ్చింది. అగ్నికి వస్తువును దగ్ధం చేసే గుణం వున్నదని గ్రహించి, ఆ బొగ్గుకు అగ్ని సంస్కారం చేశాడు. అప్పుడు ఆ బొగ్గు శుద్ధమైన తెల్లని పదార్థంగా మారింది. దానిని జాగ్రత్తగా తెచ్చి గురువుగారికి యిచ్చి, తాను ఏ విధంగా గురుబోధను విచారణ చేసి, యీ నిర్ణయానికి వచ్చినది చెప్పాడు. అప్పుడు ఆ గురువు ఆ శిష్యుని ఆలింగనం చేసుకుని, ఆనంద భాష్పాలు రాలుతుండగా 'శిష్యా! నా బోధలోని సారాంశాన్ని ఎంత చక్కగా గ్రహించావు' అని సంతోషించాడు.

గురుబోధను శ్రద్ధగా విని, అనుష్ఠించినవాడు తప్పక గమ్యాన్ని చేరుకుంటాడు. అట్టి శిష్యుని చూసినప్పుడు సత్యగురువు ఆనందానికి మేర వుండదు. క్షణ క్షణం మారే జగత్తు బొగ్గువలె అత్యంత మలినం, కాని దానిని ప్రకాశింపజేసే సర్వవ్యాపకమైనది ఆత్మవస్తువు. ఆ ఆత్మ వస్తువును సాక్షాత్కరింపజేసుకోవటానికి నీవు ప్రయత్నించాలి. అట్టి మహదానందాన్ని మనమందరం పొందాలన్నదే శ్రీగురుదేవుల ఆకాంక్ష!

నేను వివరించిన విషయాన్ని చక్కగా గ్రహించి, మాటల రూపంలో పెట్టటానికి ప్రయత్నించు. విజయం నీకు తప్పక లభిస్తుంది.

మాతాజీ - నాల్గవ శిష్యునితో నీవు దేనిని గురించి చెప్పాలని అనుకుంటున్నావు?
నాల్గవ శిష్యుడు - సాధన చతుష్టయం గురించి మీరు తెలియ జేస్తారా? మీరు చెప్పినది జ్ఞప్తి పెట్టుకుని ఉపన్యాసం చెప్పాలని ఉన్నది నాకు.
మాతాజీ - అదే సాధకుడు సంపాదించవలసిన నిజమైన సంపద. ఇందులో మొదటిది 'నిత్యానిత్య వస్తు వివేకము' - అంటే మనం చూస్తున్న దానిలో ఏది సత్యం? ఏది అసత్యం? అని విచారణ చేయాలి. ఈ సంపదలు, భోగభాగ్యాలు, ఆఖరికి ఈ శరీరమూ అనిత్యమే. మరి సత్యమైనది, నిత్యమైనది ఏది? అదే ఆత్మవస్తువు. దానిని విచారణ ద్వారా తెలుసుకోవాలి. అలా విచారణ చేయగా చేయగా అనిత్యమైన వాటి మీద విరాగం ఏర్పడుతుంది.

ఇహ రెండవది 'ఇహాముత్రార్థ ఫల భోగ విరాగము' - ఇహ లోకంలోని, పరలోకంలోని సుఖాల యందు వైరాగ్యం కలిగి ఉండటం.

ఇక మూడవది 'శమాది షట్క సంపత్తి' - ఇవి శమము, దమము, ఉపరతి, శ్రద్ధ, తితీక్ష, సమాధానము అని ఆరు. శమం అంటే అంతరేంద్రియ నిగ్రహం; దమం అంటే బాహ్యేంద్రియ నిగ్రహం; ఉపరతి అంటే ఆత్మవస్తువు నందే మనస్సు నిలిపి ఉంచటం; శ్రద్ధ అంటే ఆత్మ వస్తువును పొంది తీరుతాను అనే దృష్టి కలిగి ఉండటం; తితీక్ష అంటే లక్ష్యార్థ సాధనలో ఎన్ని పరీక్షలు వచ్చినా తట్టుకో గలగటం; సమాధానం అంటే ఎప్పుడైతే లక్ష్యార్థ సాధనలో శ్రద్ధ తితీక్షలు వుంటాయో అక్కడ సమాధానం ఉంటుంది.

ఇక నాల్గవది ముముక్షుత్వం అంటే మోక్షము నందు ఆపేక్ష కలిగి ఉండటం. పైన చెప్పిన మూడూ సాధించినవాడికి ముముక్షత్వం కరతలామలకమే. మనం బ్రతికి ఉండగానే మోక్షాన్ని పొందాలి. అదే ఆత్మానుభూతి. దానిని ఈ శరీరంతో జ్వరం వస్తే ఎలా అనుభవిస్తామో, అలా అనుభవించ గలగాలి. చచ్చిపోయాక వచ్చేది ఎత్తిపోతలే! అనేవారు శ్రీగురుదేవులు.

ఈ సాధన సంపత్తిని పొందాలంటే సత్యగురుదేవులు అవసరం. వారు మనకి తారక మంత్రాన్ని ఉపదేశిస్తారు. దానిని ఏకధారగా అనుష్ఠానం చేస్తే లక్ష్యార్థ సిద్ధి కలుగుతుంది. శ్రీ గురుదేవులు యిచ్చిన

మంత్రాన్ని మననం చేయగా చేయగా మనమే ఆ మంత్ర స్వరూపులం అయిపోతాము. అట్టి స్థితిని పొందటానికి సాధన చతుష్టయ సంపత్తి కలిగి ఉండాలి.

సాధకుడు గురుబోధను విని, చక్కగా విచారణ చేయాలి. శ్రీగురుదేవులు మనకి మంత్రోపదేశం చేసేటప్పుడు మనకి అడ్డువచ్చే వాటిని తొలగించుకోమని చెబుతారు. వేటిని నిరోధించుకోవాలో బోధ రూపంలో అందజేస్తారు. వాటిని నిరోధించగలిగితే ఆనందం మన సొత్తే! గురుమూర్తి ఇచ్చిన నామం మనలను తప్పక తరింపజేస్తుంది అనే గట్టి నమ్మకంతో సాధన చేసినవాడు తప్పక తరించ గలుగుతాడు. నామాగ్నిలో అతని సర్వకర్మలు దగ్ధమై జ్ఞానిగా ప్రకాశిస్తాడు.

ఇప్పుడు మీరు ఎన్నుకొన్న టాపిక్స్ మీద మంచి అవగాహన మీకు కలిగింది కదా! వాటి మీద విచారణ చేసి, ఇంకా ఎలా చెప్తే రక్తి కడుతుందో తెలుసుకోండి. అవకాశం దొరికినప్పుడు ఏ మాత్రం తడబడకుండా చెప్పండి. మనకేం భయం? మన గురుదేవులు మన చెంత ఉన్నప్పుడు ! మన వెంటే ఉన్నప్పుడు! శుభాశీస్సులు!!



# మధురకవి-గురుభక్తి

-సుషమ్న ప్రసాద

వైష్ణవ గురుపరంపరలో మధురకవి ఆళ్వారుకు తన గురుదేవుడు నమ్మాళ్వారు పట్ల వున్న గురుభక్తి జగత్ప్రసిద్ధమైనది. వైష్ణవ గురు పరంపరలో అంతటి విశిష్ఠమైన గురుభక్తిగల మహాభక్తుడు భగవత్ రామానుజాచార్యులవారు. ఆ గురుమూర్తి తిరువరంగతు అముదనార్ కావేరీ నదీ తీరంలో మూంగికూడి గ్రామంలో జన్మించి, శ్రీరంగ దేవాలయంలో శ్రీరంగనాధస్వామి సేవలో తన జీవితాన్ని పునీతం చేసుకున్నాడు.

స్వామివారి నిత్యసేవలన్నీ తానే నిర్వహించేవాడు. సుప్రభాత సేవ, పంచాంగ శ్రవణము, ఆళ్వార్ల రచించిన పాశుర పఠన కార్యక్రమములన్ని తానే నిర్వహించేవాడు. స్వామికి నిత్యము చేసే యీ విశేష సేవల వల్ల ఆయనను 'పెరియకోయిల్ నంబి' పెద్ద గుడి పూర్ణ అని పిలిచేవారు.

శ్రీరంగనాధ స్వామి దేవాలయంలో భక్తి సేవా కార్యక్రమములను చక్కగా నిర్వహించటానికి, పరిపాలన వ్యవహారమును శ్రీరామానుజులను ఆదేశించారు. మొదట్లో నంబి, ఆచార్యులవారు తనతో సహకరించక, తన సేవాకార్యక్రమాలలో జోక్యం చేసుకుంటున్నారనే భావన, ఆయన చేసే సంస్కరణలకు అవరోధం కలిగించాలనే ప్రయత్నం చేశాడు. ఆచార్యుల పట్ల కూడా తన ప్రవర్తనలో నిర్లక్ష్యముండేది. ఆయన నిరసన దృష్టి చూసి, శ్రీరామానుజాచార్యులు పెరియకోయిల్‌నంబిని దేవాలయ సేవలనుండి తొలగించాలనుకున్నాడు. కానీ ఆ రాత్రి స్వామి ఆచార్యులవారికి స్వప్నములో దర్శనమిచ్చి, "నంబి యింతవరకు తన అద్భుత సేవలతో నాకు ప్రేమపాత్రుడయ్యాడు. అందువలన అతనిని శిక్షించటం కంటె సరిదిద్దటం మంచిది" అన్నారు.

అంతట రామానుజాచార్యులవారు తన ప్రధాన శిష్యుడైన కురేశ పూర్ణుని పిలిచి, నంబిని సక్రమమ మార్గంలో పెట్టే బాధ్యతను అతనికి అప్పజెప్పారు. వెంటనే కురేశుడు నంబికి ఆచార్యులపట్ల భక్తికలగటానికి, ఆయన యొక్క గొప్పతనమును, తనకు ఆయనతో గల సన్నిహిత సంబంధమును చక్కగా వర్ణించి చెప్పాడు.

వెంటనే నంబి రామానాజుచార్యులవారి ఘనతను గ్రహించి, వారిపట్ల తన యొక్క అనుచిత ప్రవర్తనకు పశ్చాత్తాపపడి, ఆయనకు మోకరిల్లి "అయ్యా! తమరు నన్ను మీ శిష్యునిగా స్వీకరించండి" అని ప్రార్థించాడు.

శ్రీరామానుజాచార్యులు నంబిలో వచ్చిన పరివర్తనకు సంతోషించి, "స్వామివారి దివ్య ప్రబంధమును మీ అమృత స్వరముతో పఠిస్తున్నారు కాబట్టి, యిక మీదట మీరు 'తిరువరంగతుఅముద నార్' అని పిలువబడతారు" అన్నారు. తమిళంలో అముద అంటే అమృతము అని అర్థం.

పరిపాలన సంస్కరణలలో భాగంగా, భగవత్ రామానుజులు అముదవార్ దేవాలయములో చేసే సేవలను, క్రతువులను కురేశ్‌కు అప్పజెప్పాలనుకున్నారు. అముదనార్ అయిష్టతతో అతని కోరికను వొప్పుకొన లేదు. అచిర కాలంలోనే అతని తల్లి దివంగత అయింది. అంత్యక్రియలకు పదకొండవరోజున ఒక బ్రాహ్మణుని పిలిచి ఆతిథ్యమిచ్చాడు. తన ఆతిథ్యంతో అతడు సంతృప్తి చెందాడా? అని ప్రశ్నించాడు. ఎప్పుడు అతిథి సంతృప్తి చెందుతాడో అప్పుడే ఆ కార్యక్రమం సవ్యంగా ముగిసినట్లు లెక్క. ఆతిథ్యము స్వీకరించిన బ్రాహ్మణుడు భగవదాదేశానుసారం యిలా చెప్పాడు "మీరు దేవాలయంలో చేసే క్రతువులను భగవత్ రామానుజాచార్యులకప్పగించినప్పుడే నేను సంతృప్తి చెందుతాను" అన్నాడు.

అముదనార్ అతిథి యిష్టానుసారమే చేస్తానన్నాడు. అముదనార్ తన హక్కులను ఆచార్యులవారికి అర్పించాడు. రామానుజాచార్లు ఆదేశించినట్లే కురేశుడా సేవలను స్వీకరించాడు.

ఆ తరువాత అముదనార్ పూర్తిగా ఆచార్యుని సేవలో లీనమయ్యాడు. ఆ విధంగా ఆయన ఆచార్యునికి బాగా సన్నిహితుడై, ఆయనకు అత్యంత ప్రియ శిష్యునిగా రూపొందాడు. ఈ విధంగా సన్నిహితుడు కావటంతో అముదనార్ విశిష్టాద్వైతంలోని లోతుపాతులను చక్కగా గ్రహించగలిగాడు.

- సశేషం

# పుట్టు భోగులము మేము

- పాలూరి కాళీప్రసాద్ U.S.A

శ్రీగురుదేవులు తరచుగా చెప్పేవారు - "లక్ష్మీదేవి మహాపతివ్రత. ఎప్పుడూ తన పతిదేవుడైన శ్రీమన్నారాయణుని అంటిపెట్టుకొని వుంటుంది. కాబట్టి మీరు ఆ నారాయణుని మనస్సులో నిలుపుకుంటే మీకు ఇహంలో కావలసినవన్నీ ఆ తల్లి చూసుకుంటుంది. ఇక ఆ పరం సంగతి నారాయణుడు చూసుకుంటాడు" అని.

ఇదే విషయాన్ని అన్నమయ్య మరింత వివరంగా 'పుట్టుభోగులం మేము' అనే కీర్తనలో వివరించాడు. "మనం సాధారణంగా ఏ మహారాజు నైనా ఆశ్రయిస్తే, వారు పల్లకీలు, అందలాలు, నిత్యం మనని పొగుడుతూ తిరిగే భట్రాజులనీ ఇవ్వవచ్చు. కానీ ఇవన్నీ, ఆ మహాలక్ష్మీ భర్తకు దాసులమైన మనకు, నడిమంత్రపు సిరిగల రాజుల నుండి ఆశించాల్సిన అవసరమేమున్నది?

పోనీ, ఆ రాజులు గ్రామాలనో, రత్నాలనో, ఏనుగులు, గుఱ్ఱాలనో యిస్తారనుకుందాం. మరి ఇవన్నీ ప్రకృతి స్వరూపిణియైన భూమాత శరీరంలో భాగాలే కదా! ఆ తల్లికి నాధుడైన వాడిని ఆశ్రయించిన మనకు యివన్నీ వేరేవాళ్ళు యిచ్చేదేమిటి?

అసలు సృష్టిలో విశేష వస్తువులన్నీ బ్రహ్మదేవుడు తయారు చేసినవే కదా! మరి ఆ బ్రహ్మకే తండ్రియైన వేంకటేశ్వరుడు మనవాడై, మనకు ఏ సమయానికి ఏది కావాలో ప్రేమతో అందిస్తున్నప్పుడు యిక మనం అన్యుల నుండి పొందవలసినదేముంటుంది? " అని అన్నమయ్య ప్రశ్నిస్తున్నాడు.



# శ్రీదేవీ శరన్నవరాత్రి పూజా మహిమ

- పరాశర ప్రసాద్

సృష్టికి చైతన్యము, ఆధారమైన జగన్మాత పరాశక్తి దివ్య చరిత్రను శ్రవణం చేసిన వ్యాసభగవానుని శిష్యులలో అగ్రగణ్యుడైన సూతమహా ముని ద్వారా శౌనకాది మహర్షులకు వినిపించిన దేవీభాగవత పురాణం ఆధారంగా ఆ పరాశక్తి పూజమహిమను గురించి మనం కొంతవరకు తెలుసుకుందాం!

పరాశక్తి మోక్ష సాధానికి చేర్చే దేవత. కోరిన కోర్కెలను తీర్చే కల్పవృక్షం. పాపాలను దగ్ధం చేసి, జ్ఞానాగ్నిని ప్రసాదించే అమృతమూర్తి, అమ్మ, జగజ్జనని.



ప్రళయకాలంలో సృష్టికర్త, రాజస శక్తి సంపన్నుడైన బ్రహ్మకు ఆధారం పద్మనాభుని నాభి కమలం. ఆయన స్థితి కర్త. సాత్విక శక్తి సంపన్నుడు. అంతేకాదు, ఆయనకు ఆధారం ఆదిశేషువు. శేషువునకు శయనము సాగరము. మరి సాగరమునకు ఆధారం? ఇంక ఎవరు? సాత్విక, తామసిక, రాజస శక్తులకు అన్నింటికి ఆధారమైన పరాశక్తి.

అందువలననే ఆ పరాశక్తిని ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షంలో పాడ్యమి మొదలు తొమ్మిది రోజులు ఆరాధించాలని దేవీభాగవతం నిర్దేశిస్తోంది.

పూజ చేసే వ్యక్తి ఏక భుక్తం చేయాలి. శుచి శుభ్రతను పాటించాలి. వేద పారాయణంతో పూజను ప్రారంభించాలి. మంగళ వాద్యాలతో, కీర్తనలతో హస్తానక్షత్రం కలిసే పాడ్యమినాడు పూజను ప్రారంభించాలి. పగలంతా ఉపవాస దీక్షచేసి, రాత్రి పూజ ముగిసిన తరువాత భుజించాలి. పూజచేసే వ్యక్తి ఈ తొమ్మిది రోజులూ నేలపైనే పరుండాలి. త్రికాలముల యందు గీతా వాద్యాలు వినికిడి అవుతూ వుండాలి. తొమ్మిది రోజులు పూజ చేయలేనివారు కనీసం సప్తమి, అష్టమి, నవమి మూడు దినములు ఉపవాసం చేసి, పూజ చేయాలి. పూజ నిర్వహించిన తొమ్మిది రోజులూ కలశస్థాపన చేయాలి. రాత్రిపూట కుమారి పూజ చేయటం శ్రేయస్కరం.

దేవీ పూజ చేసిన వారికి పరాశక్తి దీర్ఘాయువు, విద్యాకీర్తి, సర్వ శుభములు చేకూరుస్తుంది. బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, దిక్పాలకులు, మహర్షులు శ్రద్ధాభక్తులతో జగజ్జనని పాదపద్మాలను పూజించి ఆ పరాశక్తి అనుగ్రహానికి పాత్రులవుతున్నారంటే మానవులు పూజించటానికి ఏం లోటు వచ్చింది?

జగజ్జనని అనుగ్రహానికి పాత్రుడైనవాడు పాపవిముక్తుడై రాకడ పోకడ లేని స్థితిని తప్పక పొందుతాడని వ్యాసభగవానుడు చెప్పినమాట విశ్వసించ దగినది కదా! ఆ పరాశక్తి స్వరూపమైన సద్గురుమూర్తి ఆశీస్సులు మన అందరిపైన సదా వర్షించుగాక!!

# యోగవాశిష్ఠము

(గత సంచిక తరువాయి) - సుషుమ్నా ప్రసాద

## భాసుడు, విలాసుల కథ

వశిష్ఠ మహర్షిలా సమాధానం చెప్పాడు, "మంచులోని తెల్లదనములా, పువ్వులోని పరిమళంలా, అగ్నిలోని మంటలా, చాంచల్యము మనసులో యిమిడివున్నది. యోగము, జ్ఞానమనే రెండు మార్గాల ద్వారా యీ చాంచల్యమును అరి కట్టవచ్చును యోగమార్గము ద్వారా మనసులో వచ్చే కదలికలు అణిచివేయిబడ్తాయి.



అది మనసును యేకోన్ముఖం చేస్తుంది జ్ఞానం. ఆత్మ విచారణ ద్వారా అన్నిటినీ శోధిస్తుంది. ప్రాణము యొక్క కదలికయే మనసు. కనుక ప్రాణమును నిగ్రహిస్తే, మనసును నిగ్రహించినట్లే, మనసును నిగ్రహిస్తే, చంచలత్వమంతరిస్తుంది, అన్ని బాధలు తొలగిపోతాయి పునర్జన్మకు తావుండదు.

తిరిగి శ్రీరామచంద్రుడిలా ప్రశ్నించాడు, "ప్రాణమునెలా నిగ్రహించాలి? దాని కదలిక నెలా ఆపు చేయాలి? ప్రాణము సదా అనూహ్యమైన శక్తితో కదులుతుంది కదా?"

వశిష్ఠ మహర్షి యిలా సమాధానం చెప్పాడు "స్థిరమై, క్రమబద్ధమైన ప్రాణాయామము అభ్యాసము వలన లేక శ్వాసను నిగ్రహించుటవలన, ప్రాణము యొక్క కదలిక నాపుచేయగలము. యోగా భ్యాసము చేసే విద్యార్థికి, యోగ శాస్త్రముల గురించి, కూలంకషమైన జ్ఞానముండాలి, ఆ వ్యక్తి కోరికల నుండి విముక్తుడై, గురూపదేశం పొంది వుండాలి, ఋషులతో, యోగులతో అంటే సత్పురుష సాంగత్యము తప్పని సరిగా వుండాలి, అప్పడే ప్రాణాన్ని నిగ్రహించటంలో, విజయాన్ని సాధించగలడు."

"శక్తి లేక ప్రాణము, ఊపిరితిత్తులలో నాడుల ద్వారా, నరములు, కండరముల ద్వారా తిరుగుతుంటుంది. ప్రాణము యొక్క చలనము వలనే, శరీరములోని, అంతరేంద్రియములకు వురవడి, శక్తి లభిస్తుంది ముఖ్యమైన శ్వాస యొక్క కదలికల వలన హృదయాంతరాళములలో

స్పందన, మనసు చేత గుర్తింపు కలుగుతుంది. ఆ ముఖ్యమైన శ్వాసనణచి వేస్తే, మనసు ప్రశాంతమవుతుంది. మనసు యొక్క క్రియనాపు జేస్తే, ప్రపంచపు వునికి యొక్క అనుభూతి అంతరిస్తుంది, అదెలాగంటే, గాఢ నిద్రలో వున్నప్పడు, మనసు క్రియారహితమై, మనకు బాహ్యా స్మృతియే వుండదు".

"ఒకే వస్తువు పై మనసునేకాగ్రత చేయటం వలన, శ్వాస నణచివేయవచ్చు, ధ్యానముతో పాటు, పూరక (శ్వాసపీల్చుట) రేచక (శ్వాసను వదులుట) ములను క్రమబద్ధంగా, అభ్యాసము చేయుట వలన చలించే ప్రాణాన్ని, అరికట్టవచ్చు. ప్రణవ పూరణతో (ఓం), ఆ శబ్దము యొక్క సత్య స్వభావముపై ధ్యానము ద్వారా, ప్రణవ ప్రాముఖ్యముపై దృష్టి నేకాగ్రత చేయటం వలన, ప్రాణమునణచి వేయవచ్చు కుంభక (శ్వాసను నిలుపుట)ము నభ్యాసము చేయుట వలన ప్రాణమును, నిగ్రహించవచ్చు, ఖేచరీముద్ర అభ్యాసము వలన కూడ, ప్రాణమును నిగ్రహించవచ్చు."

నాలుక కొసను మడిచి, నోటిలోని పై పేటికవరకెత్తి, కొండనాలుక కంటించి, నోరు బిగిస్తే గాలి కంఠ నాళిక వరకు వెడ్తుంది. తద్వారా ప్రాణము యొక్క కదలిక నరికట్టవచ్చు, మనసును సంకల్పరహితం చేసుకొంటే ప్రాణమునాపవచ్చు, అతి ప్రాముఖ్యమైన శ్వాస నాసిక కొననుండి 12 అంగుళములమేర వరకు చరిస్తుంది, ఈ ప్రాంతాన్ని మనము శ్రద్ధగా గమనించాలి, ప్రాణమును యీ మార్గము ద్వారానే నిగ్రహించవచ్చు, నేత్రాలను రెండు కనుబొమ్మల మధ్య (భ్రుకుటి) నిలపాలి అది ప్రాణము యొక్క కదలికలను అరికడ్తుంది."

"ఈ అభ్యాసముల వలన, ప్రాణమును నిగ్రహించవచ్చు, క్రమేపి, పునర్జన్మల నుండి స్వేచ్ఛ లభిస్తుంది. ఈ పద్ధతుల నవలంబించుట వలన, మానవుడు దుఃఖము నుండి విముక్తుడై, దివ్యానందములో వోలలాడుతాడు, పరమాత్మలో లీనమవుతాడు, ప్రాణమును నిగ్రహిస్తే, మనసు సద్దుమణుగుతుంది. ప్రాణమునకు, మనసుకు మధ్య చాలా సన్నిహిత సంబధమున్నది, మనసు ప్రశాంతంగా వుంటే, మూల కారణములో లయమవుతే, బ్రహ్మ యొక్కటే వుంటుంది, ఎవరి మనసు కోరికలు, ఆరాటమునకు సుదూరంగా వుండి, పరమాత్మలో శాశ్వత విశ్రాంతిని తీసుకొంటుందో, అతను వుత్తమోత్తముడు".

- సశేషం

# పూలమ్మువాని ఇల్లు చేరిన పల్లెపడుచులు

- శ్రీరామకృష్ణ పరమహంస

కొందరు పల్లెపడుచులు చేపలు అమ్ముకుని, సంతనుండి తిరిగి యింటికి పోవుచూ, దారిలో పెద్ద వడగండ్ల వాన వచ్చినందున, ఆ దగ్గరలోనే ఉన్న ఒక పూలు అమ్మేవాని యింటికి ఆ పూట గడిపేందుకు ఆశ్రయం అడిగారు. ఆ వర్తకుడు జాలి తలచి, తాను మల్లెపూలు పెట్టుకొనే గదిలో ఆ రాత్రి వారు పడుకునేందుకుగాను అంగీకరించాడు.

ఆ గదిలో తట్టల కొలది మల్లెపూలు ఉండటం వలన ఆ గది అంతా సుగంధ పరిమళాలతో ఘుమఘుమలాడిపోతున్నది. కానీ చేపల వాసనకు అలవాటు పడిన ఆ పల్లెపడుచులకు ఆ మల్లెపూల వాసన భరించటం దుర్భరమైపోయింది. వారికి నిదుర పట్టటం లేదు. వారిలో ఒక ఆమె దానికి నివారణోపాయం కనిపెట్టి యిలా చెప్పింది "ఖాళీగా వున్న మన చేపల బుట్టలో కాసిని నీళ్ల చుక్కలు జల్లి, మనం ఆ గంపలను మన ముఖం దగ్గర ఉంచుకుని పడుకుందాం. ఈ మల్లె పూల వాసనకు ఇదియే విరుగుడు" అని చెప్పింది. ఈ సదాలోచనకు ఆ మిగిలిన పల్లెపడుచులంతా ఎంతో సంతోషించి అంగీకరించి అలాగే చేశారు. అరగడియలో వారందరూ గుఱ్ఱుపెట్టి నిదురపోసాగారు!

అభ్యాసమెంత గొప్పదో! సాంసారిక దుశ్చింతలో పుట్టిపెరిగి, పేడలో పురుగువలె ఆ మాలిన్యములోనే జీవించటానికి అలవాటుపడిన లౌకికుల గతి ఇంతే! పవిత్రము, వైరాగ్యము, త్యాగము ప్రకాశించే తావున అట్టివాడు ఒక నిమిషమైననూ ఉండజాలలేడు కదా! అట్టి వాతావరణానికి అతడు ఉక్కిరిబిక్కిరి అయిపోతాడు!

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2016

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

09 ఆది : దుర్గాష్టమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 సోమ : మహర్నవమి. ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 మంగ : విజయ దశమి - ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహోత్సవం, ఉదయం 11గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ, భక్తసమారాధన.

29 శని : నరక చతుర్దశి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

30 ఆది : దీపావళి - ఉదయం 11గం. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

**నవంబర్ 2016**

03 గురు : నాగుల చవితి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

10 గురు - చిలుక ఏకాదశి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

11 శుక్ర : క్షీరాబిద్ధి ద్వాదశి - సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

14 సోమ : గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

17 గురు - శ్రీసద్గురుదేవుల ఆరాధన ప్రారంభం. సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

24 గురు : శ్రీ గురుదశమి, సాయంత్రం 5-30ని॥ సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన.

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

అక్టోబర్ 2016

01 శనివారము నుండి 13 తేది వరకు శ్రీ దేవీ శరన్నవరాత్రోత్సవములు

02 ఆది : గాంధీ జయంతి.

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ.

09 ఆది : దుర్గాష్టమి - శ్రీజగన్మాత సామూహిక కుంకుమ పూజలు.

10 సోమ : మహర్నవమి.

11 మంగ : విజయ దశమి - శ్రీజగన్మాతసామూహిక కుంకుమ పూజలు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసాలు.

12 బుధ : ఏకాహం, దీక్షా విరమణ, బీజ పూరిత మంత్రాక్షలతో శ్రీ మాతాజీ వారి ఆశీర్వచనం, సాయంత్రం 6గం.లకు జగన్మాత నగరోత్సవం,

13 గురు : సాయంత్రం 6-30ని॥ శ్రీసద్గురుపాదపూజా మహొత్సవం.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి - శ్రీమాతాజీవారి జన్మదిన మహొత్సవం, శ్రీసద్గురుపాదపూజ, సద్గురుమండలదీక్ష ప్రారంభం; భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

29 శని : నరక చతుర్దశి, మాసశివరాత్రి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం.

30 ఆది : అమావాస్య - దీపావళి - శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాకాయలు కాల్చుట.

**నవంబర్ 2016**

02 బుధవారం -కార్తీక శుద్ధ తదియ నుండి 10 గురువారం ఏకాదశి వరకు ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వరస్వామివారికి పంచామృతాలు, నవరసాలతో ఏకాదశ రుద్రాభిషేకాలు, లక్షబిల్వార్చన.

03 గురు : నాగుల చవితి.

11 శుక్ర : క్షీరాబిద్ధి ద్వాదశి - శ్రీ సద్గురు పాద పూజ, భక్త సమారాధన.

12 శని : శని త్రయోదశి

14 సోమ : గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన, సాయంత్రం 6గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి ఊరేగింపు. చాతుర్మాస్య దీక్ష విరమణ.

17 నుండి 24వరకు శ్రీగురుదేవుల పుణ్యఆరాధనామహొత్సవాలు.

23 బుధ : శ్రీ గురు దశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాద పూజ.

24 గురు : బృందావనంలో శ్రీసద్గురుదేవులకు మహాభిషేకం, సద్గురు మండలదీక్షా పరిసమాప్తి, సప్తాహ విరమణ, సద్గురుమూర్తి నగరోత్సవం.

27 ఆది : మాస శివరాత్రి.

29 మంగ : అమావాస్య.

# పరిప్రశ్న

- పరాశర ప్రసాద్

మరణవేదన ఎలా ఉంటుంది? లేక అంత్యకాలంలో మనస్సు యొక్క స్థితి ఎలా ఉంటుంది? అని శిష్యుడు లేవదీసిన సందేహాలను



పురస్కరించుకుని శ్రీగురుదేవులు మాట్లాడుతూ "అనాయాస మరణం చాలా గొప్పదని భావిస్తారు. ఏ రకమైన శారీరక వ్యథను అనుభవించకుండా మరణించటాన్ని అనాయాసమరణంగా భావించటం సహజం. అది యదార్థం కాదు సుమా!

యోగవాశిష్టంలో వశిష్ఠులవారు శ్రీరామ చంద్రునికి బోధిస్తూ దేహాన్ని ఎక్కడ ఏవిధంగా ఏ ప్రదేశంలో త్యాగం చేసినా అది ఆ వ్యక్తి యొక్క మానసిక స్థితికి, సాధనకు, ఆత్మజ్ఞానానికి సంబంధం లేదని చెప్పారు. దేహ త్యాగ సమయంలో మనస్సు నిశ్చలంగా, నిర్మలంగా, సంకల్ప రహితంగా, వాసనా రహితంగా వుండటమే అనాయాస మరణం. దేహ భావన లేనివారికి దేహస్థితిని గురించిన ఆలోచన వుండదు కదా! శ్రీ రామకృష్ణ పరమహంసగాని, శ్రీ రమణ మహర్షిగాని దేహత్యాగం చేసినప్పుడు వారి దేహస్థితిని గూర్చి ఎన్నడూ చింతనచేయలేదే!

కానీ, వ్యవహారికంగా విచారణ చేస్తే మరణము కూడా జాగ్రత స్వప్న సుషుప్తి అవస్థలలాగా ఒక అవస్థే. ఎందువలన అంటే ఒక దేహాన్ని వదిలిన జీవుడు మరియొక దేహాన్ని ఆశ్రయించక తప్పదు. ఈ రెండు దశల మధ్య దశ మరణము. చినిగిన షర్ట్‌ను వదిలివేసినట్లు, కృశించి, క్షీణించిన దేహాన్ని వదలక తప్పదు. దేహేంద్రియాదులు ప్రపంచంతో గల సంబంధాన్ని కోల్పోవటమే మరణము.

ఏ ఉపాధిని చేరుకోవాలి అని నిర్ణయించుకోవలసినది జీవుడే. తనలో వాసనగా మిగిలిపోయిన కోరికల ననుసరించి పంజరాన్ని ఎంపిక చేస్తాడు. భగవానుడు కేవలం సాక్షి. మరణం శాశ్వతం కాదు. కాలానికి లోబడి వుంటుంది.

ఒక గృహం ఆవాసానికి అనుకూలంగా లేకపోయినా, శిథిలమై పోయినా, దానిలో నివసించేవారు వేరొక గృహాన్ని తమకి అనుకూలంగా

ఉందో లేదో చూసుకుని దానిలోకి తరలిపోయినట్లుగా జీవుడు శిథిలమైన యీ దేహాన్ని త్యాగము చేయవలసిన సమయం ఆసన్నమైతే, తన మనస్సుకు ఆనందాన్ని ప్రసాదించే వసతిగల పంజరం లేదా ఉపాధిని ఆశ్రయించక తప్పదు సుమా! కానీ ఆత్మజ్ఞాన సంపన్నుడు బ్రహ్మపథాన్ని చేరుకుంటాడు.

మానవుడు మరణం లేకుండా చేసుకోలేడా! అసంభవం! జననం ఉంటే మరణం తప్పదు. కాబట్టి జననం లేకుండా చేసుకుంటే మరణాన్ని జయించవచ్చు. జనన మరణ వలయం నుండి తప్పించుకునే మార్గమే సాధన. ప్రతి కార్యానికి కారణం ఉంటుంది. జనన మరణాలకు కారణం వాసన. అదే కారణ శరీరంగా వ్యవహరింప బడుతుంది. అది మనస్సుని ఆశ్రయించి ఉంటుంది. మనస్సుని తొలగించటం అసంభవం. మనస్సులోని వికారాలను తొలగించాలి. అది కేవలం సాధన ద్వారా మాత్రమే సాధ్యపడుతుంది. సాధనకి పురుష ప్రయత్నం కావాలి. అది కేవలం సద్గురుమూర్తి సమాశ్రయంతోనే సాధ్యపడుతుంది” అని శ్రీ సద్గురుదేవులు హెచ్చరించారు.

## పెదనింద్రకొలను శాఖలో కార్యక్రమాలు

అక్టోబర్ 2016

08 శని : మూలా నక్షత్రం, సరస్వతీ పూజ; ఉదయం 11గం.లకు కుంకుమ పూజలు.

09 ఆది : దుర్గాష్టమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

10 సోమ : మహర్నవమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ.

11 మంగ : విజయ దశమి - ఉదయం 11గం.లకు కుంకుమ పూజ, శ్రీసద్గురుపాదపూజ.

16 ఆది : ఆశ్వీయుజ పౌర్ణమి; శ్రీ మాతాజీ జన్మదిన మహోత్సవం - రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

25 మంగ : శ్రీ గురుదశమి - రాత్రి 7గం.లకు శ్రీ సద్గురుపాద పూజ.

నవంబర్ 2016

14 సోమ : గురుపూర్ణిమ, గురునానక్ జయంతి, రాత్రి 7గం.లకు శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

24 గురు : శ్రీ గురు దశమి, రాత్రి 7గం.లకు శ్రీ సద్గురు పాద పూజ.

# విష్ణువు ఎక్కడ?

- పళని

హిరణ్యకశిపుడు ద్వేషంతో పాములా బుసలు కొడుతున్నాడు. అజేయుడైన తన అన్నగారు హిరణ్యాక్షుణ్ణి విష్ణువు వరాహ ఆకారంతో వచ్చి సంహరించాడట! ఇదెలా సాధ్యం? మరుక్షణంలో హిరణ్యకశిపుడు మహోగ్రమైన ఆగ్రహంతో రాక్షసబలాన్ని వెంటబెట్టకుని శూలాయుధాన్ని ధరించి ప్రళయ కాలాగ్నిలా వైకుంఠంపైకి దండెత్తాడు.

మహావిష్ణువు కార్యసాధనకై ఆలోచిస్తున్నాడు. "వీడికింకా మరణ సమయం ఆసన్నం కాలేదు. ఇప్పుడు ఎదిరించటం కుదరదు. ఎక్కడైనా దాగుదామా! అంటే త్రిలోకాలను దహించుకుంటూ మృత్యువు మాదిరి వస్తున్నాడు. ఇక ఒక్కటే ఉపాయం - సూక్ష్మరూపం ధరించి వీడి హృదయాంతరాళాలలో చేరటం ఉత్తమం అని నిర్ణయించి, హిరణ్యకశిపుని ముక్కు రంధ్రాల గుండా ఊపిరి ద్వారా వాని హృదయాంతరాళాలలో చేరి పదిలంగా కూర్చున్నాడు విష్ణువు.

వైకుంఠంలో విష్ణువు కనబడకపోయేసరికి హిరణ్యకశిపుడు తనకు భయపడి విష్ణువు ఎక్కడికో పారిపోయాడని తలచి మూడు లోకాలు, ఆకాశము, భూమి, దిక్కులు, పర్వతాలు, సముద్రాలు సమస్తమూ - అణువణువూ శోధించాడు. విష్ణువు కనబడలేదు. చివరకు తన పేరు వినేసరికి భయంతో విష్ణువు చనిపోయి ఉంటాడని నిర్ణయించుకున్నాడు. బ్రతికి ఉంటే ఎక్కడ దాక్కుంటాడు? అంతా గాలించాను కదా! కాబట్టి తప్పకుండా చనిపోయే ఉంటాడు. సందేహం లేదు. ధీరుడైనవాడు చనిపోయిన శత్రువుపై పగ పెట్టుకోడు - అని నిర్ణయించుకుని హిరణ్యకశిపుడు తన స్వంతలోకానికి వెళ్ళిపోయాడు.

త్రిలోక సంచారి నారదుడు వైకుంఠానికి విష్ణుదేవుని సన్నిధికి వచ్చి అద్భుతపడుతూ "ప్రభో! ఏమిటీ వైష్ణవమాయ!" అని ప్రశ్నించాడు. విష్ణుదేవుడు పెదవులపై చిరునవ్వుతో "నారదా! నీకు తెలియనిది ఏమున్నది? హిరణ్యకశిపుడు నన్ను సంహరించాలని తనను విడిచి అంతా అన్వేషించాడు. తనలో వెదకక పోవటమే రాక్షస స్వభావము" అన్నాడు, ఋషిపుంగవుడు నారదుడు "ఎవరికైనా, ఎంతటివారికైనా తనలో తాను లోచూపుతో అన్వేషించటానికి తమ అనుగ్రహం వుండి తీరాలి భక్తవత్సలా!" అంటూ విష్ణుదేవుణ్ణి అనేక విధాల కీర్తించాడు.

# అనింద్యునిపై గణపతి విజయం

- రావి శోభ

యక్షులకు రాజు, నవనిధులకు అధిపతి, మహేశ్వరునికి ప్రియ మిత్రుడైన కుబేరుని కుమారుడు అనింద్యుడు. ఇంద్రజాల, కామరూపాది విద్యలన్నీ అతనికి జన్మతః సహజసిద్ధంగా లభించాయి. కుబేరుడు అతనికి అసంకల్పితంగానే 'అనింద్యుడు' అని పేరు పెట్టాడు.

అనింద్యుడు బ్రహ్మదేవుని వద్ద గాయత్రి మంత్రోపదేశం పొంది, ఆదిత్యుని ద్వారా త్రికాల సంధ్యావందన విధానాలను అభ్యసించాడు. గాయత్రి మహామంత్ర జప పుణ్యఫలం చేత, త్రికాల సంధ్యా ఫలం చేత మరో ఆదిత్యునిలాగ భాసించాడు. యక్ష రాజ్యానికి, యక్షజాతికి యువ రాజుగా అభిషిక్తుడయ్యాడు.



ఇది ఇలా ఉండగా ఒకనాడు అమ్మలగన్నయమ్మ, ముగురమ్మల మూలపుటమ్మ అయిన జగన్మాత జగదీశ్వరి నివాసం మణిద్వీపం. సమస్త లోకాలలో నివశించేవారంతా మణిద్వీపం చేరి 'అమ్మ'ని దర్శించి ఆశీస్సులు పొందుతుంటారు. అంటే అమ్మ సామాన్యురాలు కాదు. పరబ్రహ్మ సృష్టి చేయాలని సంకల్పించి తాను సాకార రూపాన్ని ధరించినప్పుడు ఆ సాకార రూపం నుండి స్వయంభువై ఉద్భవించిన పరమేశ్వరి ఆమె. ఒక్క మాటలో చెప్పాలంటే త్రిమూర్తులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులు; త్రిమాతలైన దుర్గా లక్ష్మీ సరస్వతులు సైతం యీ జగన్మాతను దర్శిస్తుంటారు.

అలాంటి సందర్భం కలిసి వచ్చి, ఒకనాడు కుబేరుడు జగన్మాత దర్శనార్థం మణిద్వీపం వెడుతూ తన కుమారుడైన అనింద్యుడిని కూడా వెంట తీసుకువెళ్ళాడు. అప్పటికే అక్కడ సభామండపంలో అనేకమంది దేవతలు మహర్షులు అమ్మవారిని స్తోత్రం చేస్తూ ఆనందపరవశులై వున్నారు. అమ్మ అష్టభుజములతో, శంఖ, చక్ర పాశ, గద, త్రిశూల, కమండల, అక్షమాల ధరించి, వరద హస్తముతో అభయమును ప్రసాదిస్తూ, ప్రసన్న వదనంతో మెరిసిపోతూ చిరునవ్వు పెదవులపై చిందిస్తూ, కరుణారస

దృష్టితో సర్వులనూ వీక్షిస్తూ, అత్యంత బలిష్టమైన, భీకరమైన, భీతిని గొలుపుతున్న సింహముపై ఆసీనురాలై ఉన్న ఆ మహాతల్లి దివ్యతేజో ప్రభలతో వెలిగిపోతున్నది.

ఆ తల్లిని దర్శించినందుకు తన జన్మ ధన్యమైనదని సంతోషంతో, భక్తితో, భావోద్వేగంతో, పులకరించి పోయిన అనింద్యుడు అమ్మని పరిపరి విధాల స్తుతించాడు. ఆహా! అద్భుతం! అద్భుతం! అంటూ అందరూ ప్రశంసల వర్షం కురిపిస్తుంటే అనింద్యునిలో చిరుగర్వం చోటు చేసుకున్నది. అతడు గర్వంతో తల పంకిస్తూ, అప్రయత్నంగా దేవతా సమూహంలో హఠాత్తుగా కనిపించిన ఒక మెరుపుతీగను చూసి అప్రతిభుడవుతూ తన భక్తిభావాలను సైతం విస్మరించాడు.

“ఆహా! ..... ఏమి సౌందర్యం! ఏమి సౌకుమార్యం! రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమాది అప్సరసలను సైతం తలదన్నే యీ అద్భుత సౌందర్య రాశి ఎవరు?” అని ఆలోచిస్తుండగా అదే సమయంలో ఆ అద్భుత సౌందర్యరాశి అప్రయత్నంగా అతనివైపు చూసింది. ఆమె అలా చూసిందే తడవుగా అనింద్యుడు అది ‘దేవి సభామండపం’ అన్న మాట కూడా విస్మరించి, కామరూపిత నేత్రాలతో ఆమెని చూస్తూ కన్నుగీటాడు. ఆ దుడుకు చర్యకు ఆ వనిత నుదురు చిట్లిస్తూ హేయభావనతో తల త్రిప్పుకుంది. ఆ అవమానాన్ని భరించలేక లోలోపలే ఆవేశంతో అనింద్యుడు రగిలిపోయాడు. అంతలో జగన్మాత ‘ప్రశంసాత్మకమైన స్తుతులు చేసిన ఆ యువకుడు ఎవరు?’ అని అడిగింది యాంత్రికంగా.

కుబేరుడు చప్పున చేతులెత్తి నమస్కరిస్తూ “నా పుత్రుడే మాతా! పేరు అనింద్యుడు” అని తెలిపాడు. “అనింద్యుడా!..... అనింద్యుడా!........” అంటూ పరిహసించింది మాత. ఆ పరిహాసానికి అందరూ నవ్వారు.

‘అనింద్యుడు’ అంటే నిందించకూడని వాడు అని అర్థం. ఆ అంతరార్థం గ్రహించి అందరూ నవ్వుతుంటే అనింద్యుడు అవమాన భారంతో లోలోపలే ఉడికిపోతూ అప్రయత్నంగా ఆ యువతివైపు దృష్టి సారించాడు. ఆ యువతి .... ఆ సౌందర్యరాశి ... అందరికంటె మిన్నగా ముసిముసి నవ్వులు నవ్వుతూ ‘నీకిదే తగిన శాస్తి!’ అన్నట్లుగా చూసింది. ఆ యువతి చేసిన పరిహాసం అనింద్యుడి హృదయాన్ని మరింతగా ఆవేశంతో రగిలించింది.

-సశేషం

# జ్ఞాని

(వార్తాలాపము నుండి) -సేకరణ మురళి

ఒక ఊరిలో ఒక జ్ఞాని ఉండేవాడు. అతనిని ప్రజలు ఎంతో గౌరవిస్తూ ఉండేవారు. ఒకసారి ఆ దేశపు రాజుగారు, ఆ జ్ఞానిని దర్శించి, ఆయనను తన భవనమునకు ఒక గజముపై ఊరేగిస్తూ తీసుకు వచ్చారు. ప్రజలందరూ ఆ జ్ఞాని రాజవైభవమును అనుభవిస్తున్నాడు అని మనస్సులో భావించారు.

తరువాత కొద్ది రోజులకు ఆ జ్ఞాని మరొక ప్రదేశమునకు వెళ్ళాడు. అక్కడ అతడు ఒక చెట్టు క్రింద ప్రయాణ బడలికచేత నిద్రించాడు. ఇంతలో కొందరు దొంగలు ఆ దేశపు రాజమందిరంలో దొంగిలించిన ధనం తీసుకు వెడుతూ, ఎవరో వెంటబడటం గమనించి, వేరే గత్యంతరం లేక ఆ ధనం మూటను యీ జ్ఞాని నిద్రిస్తున్న చెట్టు క్రింద వదిలి పారిపోయారు.

ఆ దొంగలను వెంబడిస్తూ వచ్చిన రాజభటులు చెట్టు క్రింద ధనం మూట, ప్రక్కనే నిద్రిస్తున్న జ్ఞానిని చూసి అతడే దొంగ అని భావించి, అతనిని మంత్రిగారి దగ్గర హాజరుపరచారు.

ఆ మంత్రి అసలు విషయం సరిగా విచారించకుండానే ఆ జ్ఞానిని ఒక గాడిదపై కూర్చోబెట్టి ఊరంతా త్రిప్పి, అవమాన పరచమని ఆజ్ఞాపించాడు. ఆ గ్రామంలోనే ఒక వర్తకుడు ఉన్నాడు. అతడు గతంలో ఈ జ్ఞానికి జరిగిన గజ సన్మానం చూశాడు. మళ్ళా యిప్పుడు యిలా అవమాన పరచటం కూడా చూసి ఎంతో దుఃఖించాడు.

కాని ఆ మహాత్ముని ముఖం మటుకు పూర్వంలాగానే ప్రసన్నంగా ఉండటం చూసి, ఆశ్చర్యంతో "ప్రభూ! ఇంత అవమానం కలిగినా కూడా, తమరు పూర్వంలాగ ఆనందంగా చిరునవ్వుతో ఏమీ జరుగనట్లే వుండటానికి గల కారణమేమిటి?" అని ప్రశ్నించాడు.

దానికి ఆ జ్ఞాని "ఈ శరీరము రక్తము, మాంసము, ఎముకలతో తయారు చేసిన బొమ్మ. దీనిని ఏనుగుపై కూర్చోబెట్టినా, గాడిదపై కూర్చో బెట్టినా భేదము లేదు" అన్నాడు. జ్ఞానులు ఎల్లప్పుడూ బ్రహ్మానందంలో మునిగి ఓలలాడుతూ ఉంటారు!!

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

(గత సంచిక తరువాయి)

ఈ విధంగా ప్రాతఃసంధ్యావందనం ముగించి బండి ఎక్కబోతున్న శ్రీరామశర్మకి నదిలో తను చూసిన గొప్పతేజస్సు కన్నా, వెయ్యి రెట్లు అధికమైన వెలుగులో నందబాలుని ముగ్ధమనోహర సుందర రూపం కనిపించింది. "అయ్యా! అలా నిలబడిపోయారేమి? త్వరగా బండి ఎక్కండి" అన్నాడు జక్కన్న.

దారిలో వెడుతున్నంత సేపూ జక్కన్న కన్నయ్య చేసిన గొప్పపనులు, గోవర్థన పర్వతం ఎత్తడం, కాళీయుని గర్వభంగం, పూతన మొదలగు రాక్షసుల సంహారం అన్నీ వర్ణించి చెప్పసాగాడు.



కన్నయ్య స్వరం శ్రీరామ శర్మ చెవులలో గుసగుసగా సరైన సమయంలో నీకొక మంత్రం చెబుతాను, అది పఠిస్తూ నువ్వు ధన్యుడౌవుతావు అన్న మాటలే వినిపిస్తున్నాయి.

ఇంటికి చేరిన తరువాత పెద్దలంతా శ్రీరామశర్మచేత దేవతలకి ఆహ్వానము, తర్పణాలు అర్పించటం చేయించారు. పితృదేవతలకి పిండ ప్రదానం చేస్తున్న వేళ మనస్సులో కన్నయ్య చెప్పినమాట ఠంగున మ్రోగింది. 'ఇదే నే చెప్పిన మంత్రం పఠించే సమయం - సర్వజగన్నియంత సర్వేశ్వరుడు, సర్వవ్యాపకుడు, సర్వశక్తివంతుడు, సర్వమూ తానే అయిన వాడు మిమ్ములను నిజ రూపాలతో రావాలని శాసిస్తున్నాడు' అని నిండు మనస్సుతో అర్చించి, ప్రార్థించిన వేళ వారందరూ శ్రీరామశర్మ కనుల ఎదుట నిజరూపాలతో వచ్చి నిలచి, అతడు అర్పించినవన్నీ స్వీకరించి, ఆశీర్వదించారు.

కడిగిన చేయి తడి కూడా ఆరకుండానే తిరిగి బయలుదేరిన కన్నకొడుకును చూసి ఆ తల్లి గట్టిగా ప్రశ్నించేసరికి, "నా చదువులు అన్నీ పూర్తి అయిన తరువాత, గురుదక్షిణ యివ్వకుండానే తిరిగి వచ్చానమ్మా! ఇప్పుడు వెళ్ళి దక్షిణ యిచ్చి రావాలి' అని చెప్పి మనస్సులో నందబాలుని దగ్గరకు వెళ్ళాలనే ఆవేదన నిలువనీయకపోవటంతో శ్రీరామ శర్మ బయలుదేరాడు. చాలా వేగంగా నడిచి యమునా నదీ

తీరానికి చేరేసరికి, వీనుల విందుగా వేణుగానం, మధురాతి మధురంగా వినిపించింది.

ఆ గానం వింటూ పరవశించిపోతూ, అడుగులు తడబడుతుంటే తన కన్నుల ఎదురుగా ఉన్న కన్నయ్యే మురళీవాయిస్తున్న నాయకుడు. తను చదువుతున్న వేదమంత్రాలన్నీ స్వరయుక్తంగా ఆ మురళీనాదంలో రవళిస్తున్నాయి. వేదసారమంతా శ్రీరామశర్మ మనస్సులో నిలిచి పోయింది. "ఇప్పుడు సాయం సధ్యాసమయం అయింది కదా! నదిలో దిగి సంధ్య వార్చుకుంటావా?" అని అడిగాడు కొంటెగా కన్నయ్య.

"ఇక ఈ స్నానాలెందుకు గోపాలా? శరీరం మీద ఉన్న దుమ్ము ధూళినే కాని, మనస్సులో పేరుకొన్న మలిన భావాలు కోపం, ద్వేషం, అసూయ, అహంకారం వంటి వాటిని వదిలించలేవు కదా! వాటిని ఒక్క ఆ దైవచింతనతో గాని మరేది వదిలించలేదు కదా!

కన్నయ్యా! నీకిప్పుడు గురుదక్షిణ ఇద్దామని వచ్చాను. ఓ సంధ్యా వందనమా! నీకు శుభమగుగాక! ఓ స్నానమా! నీకు నమస్కారము! ఓ దేవతలారా! ఓ పితృదేవతలారా! ఇక మీకు నేను తర్పణాలు ఇవ్వలేను. నన్ను క్షమించండి. వీటన్నిటిని చేకూర్చగల శక్తివంతుడు, సర్వవ్యాపకుడు, సర్వాధికారి అయిన యోగీశ్వరేశ్వరుడు, పరమేశ్వరుడు, యదుకుల తిలకుడు, నా మనోహరుడు అయిన శ్రీకృష్ణదేవుని దివ్యచరణాల వద్ద నా మనస్సును సమర్పిస్తున్నాను. నా గురుమూర్తిని అక్కడే కూర్చుని స్మరించుకుంటాను. అది చాలు! నాకు ఇంకేమీ వద్దు." అన్నాడు శ్రీరామశర్మ.

## *సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి*

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా అక్టోబరు 2016, నవంబరు 2016 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

అక్టోబరు 2016 : AS 2098, 4879, 5300, 6448, 6575, 6931,6934, 6938,
AS 6939, 7171, 7172, 7173, 7174, 7175, 7176,
AS 7177, 7180, 7181

నవంబరు 2016 : AS 1913, 4800, 6455, 6456, 6459, 6592, 6867, 7185,
AS 7187, 7188, 7189,7190, 7191.

– మేనేజర్

(గత సంచిక తరువాయి) **గీతాధ్యయనమ్** - రమణ ప్రసాద్

## 18. మోక్ష సన్న్యాస యోగము

"అర్జునా! సుఖం కూడా మూడు విధాలు: రాజసం, తామసం, సాత్వికం. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అని నాలుగు వర్ణాలు. వారి స్వభావం వల్ల కలిగిన గుణాలను బట్టి విభజించబడ్డాయి. తాను చేసే కర్మ మీద ఆసక్తి, శ్రద్ధ ఉన్నవాడు సిద్ధి పొందుతాడు."



శ్రేయాన్ స్వధర్మో విగుణః, పరధర్మాత్స్వనుష్ఠితాత్।
స్వభావ నియతం కర్మ, కుర్వన్నాప్నోతి కిల్బిషమ్ ॥ 47

"బాగుగా ఆచరింపబడ్డ ఇతరుల ధర్మం కంటె, గుణంలేనిదానిగా కనిపించినా, స్వధర్మమే మంచిది. స్వధర్మం నిర్వర్తించేవానికి పాపం అంటదు."

సిద్ధిం ప్రాప్తో యథా బ్రహ్మ,తథాఽఽప్నోతి నిబోధ మే ।
సమాసేనైవ కౌంతేయ! నిష్ఠా జ్ఞానస్య యా పరా ॥ 50
బుద్ధ్యా విశుద్ధయా యుక్తః,ధృత్యాఽఽత్మానం నియమ్య చ ।
శబ్దాదీన్ విషయాంస్త్యక్త్వా,రాగద్వేషౌ వ్యుదస్య చ ॥ 51
వివిక్తసేవీ లఘ్వాశీ,యత వాక్కాయ మానసః ।
ధ్యానయోగపరో నిత్యం,వైరాగ్యం సముపాశ్రితః ॥ 52
అహంకారం బలం దర్పం,కామం క్రోధం పరిగ్రహమ్ ।
విముచ్య నిర్మమశ్శాంతః,బ్రహ్మభూయాయ కల్పతే ॥ 53

"పరిశుద్ధమైన బుద్ధి కలిగి, ధైర్యంతో మనసును వశపరచుకొని, శబ్దాది విషయాలను, రాగ ద్వేషాలను విడిచి పెట్టి, ఏకాంత వాసం చేస్తూ, మితంగా తింటూ, మాటలు శరీరం అదుపులో పెట్టుకొని నిరంతరం ధ్యాన యోగంలోఉంటూ, వైరాగ్యాన్ని ఆశ్రయించి, అహంకారం, బలం, దర్పం, కామం, క్రోధం, వస్తు సేకరణలను విడిచి, మమకారం లేకుండా, శాంత స్వభావం కలిగినవాడు బ్రహ్మ స్వరూపం పొందటానికి అర్హుడు. అట్టి బ్రహ్మ స్వరూపం పొందినవాడు నా పట్ల పరమభక్తి కలిగి వుంటాడు."

చేతసా సర్వకర్మాణి,మయి సంన్యస్య మత్పరః ।
బుద్ధియోగ ముపాశ్రిత్య,మచ్చిత్తః సతతం భవ ॥ 57

"హృదయ పూర్వకంగా అన్ని కర్మలు నాకే అర్పించి, నన్నే పరమ గతిగా భావించి, ధ్యాన యోగాన్ని అవలంబించి నీ మనస్సు నా మీదే ఉంచు. నా అనుగ్రహంతో సంసార సంబంధమైన ప్రతిబంధకాలను అధిగమిస్తావు."

ఈశ్వరస్సర్వభూతానాం,హృద్దేశేఽర్జున! తిష్ఠతి ।
భ్రామయన్ సర్వభూతాని,యంత్రారూఢాని మాయయా ॥ 61
"అర్జునా! సర్వేశ్వరుడు సమస్త ప్రాణుల హృదయంలో విలసిల్లుతూ, తన మాయతో సర్వభూతాలను కీలుబొమ్మలలాగా ఆడిస్తున్నాడు."
"అన్ని విధాల ఈశ్వరుడినే శరణు వేడు. ఆయన దయ వల్ల పరమ శాంతము, శాశ్వతమైన మోక్షాన్ని పొందుతావు"
మన్మనా భవ మద్భక్తః,మద్యాజీ మాం నమస్కురు ।
మామేవైష్యసి సత్యం తే,ప్రతిజానే ప్రియోఽసి మే ॥65
"నామీదే మనసు ఉంచి, నా పట్ల భక్తితో, నన్ను పూజించు. నాకు నమస్కరించు. నాకు ఇష్టుడవు కనుక ఇది నిజం అని శపథం చేసి చెబుతున్నాను. నువ్వు అలా చేస్తే తప్పక నన్ను చేరుతావు. సమస్త కర్మలను విడిచిపెట్టి నన్నే ఆశ్రయించు. పాపాలన్నిటినుంచి నీకు ముక్తిని కలుగజేస్తాను. విచారించకు. పార్థా! నిశ్చలమైన మనసుతో గీతా శాస్త్రాన్ని విన్నావు కదా!అవివేకం వల్ల కలిగిన నీ భ్రాంతి అంతరించినదా లేదా!"
నష్టో మోహః స్మృతిర్లబ్ధా,త్వత్ప్రసాదాన్ మయాఽచ్యుత! ।
స్థితోఽస్మి గతసందేహః,కరిష్యే వచనం తవ ॥ 73
"కృష్ణా! నీ దయ వల్ల నా వ్యామోహం తొలగినది. నా సందేహాలన్నీ తీరిపోయాయి.. నీ ఆదేశాన్ని శిరసావహిస్తాను."
సంజయుడు : శ్రీకృష్ణ భగవానుడికి, అర్జునుడికి మధ్య ఇలా ఆశ్చర్యకరంగా ఒళ్ళు పులకరించేటట్లుగా సాగిన సంవాదాన్ని విన్నాను. ఓ ధృతరాష్ట్ర మహారాజా! అద్భుతము, పుణ్య ప్రదము అయిన కృష్ణార్జున సంవాదాన్ని పదే పదే స్మరించుకుంటూ సంతోషిస్తున్నాను.
యత్ర యోగేశ్వరః కృష్ణః,యత్ర పార్థో ధనుర్ధరః ।
తత్ర శ్రీ ర్విజయో భూతిః, ధ్రువా నీతిర్మతిర్మమ ॥ 78
"యోగీశ్వరుడైన శ్రీకృష్ణ భగవానుడూ, ధనుస్సు ధరించిన అర్జునుడూ, వుండే చోట, విజయం ఐశ్వర్యం, నీతి నిలకడగా ఉంటాయి అని నా నమ్మకం."

*ఇది శ్రీవ్యాసముని విరచితమైన, నూరువేల శ్లోకములు గలదియు, ఛందోబద్ధమైనది అగు శ్రీ మహాభారతములో భీష్మ పర్వమున గల ఉపనిషత్ప్రతిపాదకమును, బ్రహ్మ విద్యయు, యోగశాస్త్రమును, శ్రీకృష్ణార్జున సంవాదమును అగు శ్రీ భగవద్గీత యందు మోక్ష సన్న్యాసయోగమను పదునెనిమిదవ అధ్యాయము సంపూర్ణము.*

# జమదగ్నిమహర్షి

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

కాలక్రమాన జమదగ్ని రేణుకలకు ఐదుగురు కుమారులు కలిగారు. వారు క్రమంగా, రుమణ్వతుడు, సుషేణుడు, వసువు, విశ్వావసువు, పరశురాముడు అనే పేర్లు కలవారు. పరశురాముడు విష్ణువు అవతారమై జన్మించాడు.



ఒకనాడు రేణుకాదేవి నీరు తేవటానికి నదికి వెళ్ళింది. అప్పుడు చిత్ర రధుడు అనే రాజు భార్యా సమేతంగా జల క్రీడలు అడుతుండగా రేణుకా దేవి విధి వశాన వారి ఆనందమును తిలకించిన కారణం చేత ఆమె చేతిలోని భాండము క్రింద పడింది. ఎప్పుడైనా అలా జరిగినప్పుడు ఆమె తన పాతివ్రత్య ప్రభావంచేత ఇసుకతో ఇంకొక కుండను తయారు చేసేది. కాని ఆనాడు కుండ తయారు చేయలేకపోయింది.

అప్పుడు తన తప్పును వెంటనే గ్రహించి తన భర్తకు నివేదించటానికి ఆశ్రమానికి వచ్చింది. ఆమె చేతిలో భాండం లేకపోవటం చూసి, తన దివ్యదృష్టితో జరిగినది గ్రహించి, ఆమె దోషమునకు పరిహారం మరణదండనమే శిక్ష అని నిర్ణయించి, తన కొడుకులను వరుసగా పిలిచి తల్లిని చంపమని ఆజ్ఞాపించాడు. మొదటి నల్గురు పుత్రులు, "మేము ఆ పని చేయలేమ"ని చెప్పారు.

పరశురాముని పిల్చి జమదగ్ని తల్లిని, అన్నలను చంపమని ఆజ్ఞాపించగా, వెంటనే అతడు తన పరశువుతో తల్లిని, సోదరులను ఖండించాడు. జమదగ్ని అతని పిత్రుభక్తికి మెచ్చి ఒక వరం కోరుకోమన్నాడు. వెంటనే చనిపోయిన తన తల్లిని, సోదరులను బ్రతికింపమని కోరాడు. జమదగ్ని పరశురాముని మాతృ ప్రేమకు,

భ్రాతృవాత్సల్యానికి మెచ్చుకొని వారిని బ్రతికించాడు.

పూర్వం. కార్తవీర్యార్జునుడను రాజు దత్తాత్రేయుని ఆరాధించి అతని వలన శత్రు జయము, వేయి చేతులు, అణిమాది సిద్ధులు, యశము, బలము, తేజమును పొంది వేటకు వెళ్లి అడవిలో సంచరిస్తూ దైవవశాన జమదగ్ని ఆశ్రమానికి చేరాడు.

జమదగ్ని డస్సియున్న రాజును భృత్యువులను చూసి, వారికి సపర్యలు చేసి, సురభి అనే హోమధేనువును రప్పించి వారికి మృష్టాన్నములతో భోజనం వడ్డించి ఆరగింపమని కోరాడు. కార్తవీర్యార్జునుడు విందారగించి, ఆ ధేనువుపై మక్కువ కలిగి, భటులను పంపాడు. వారు జమదగ్నితో యుద్ధానికి తలపడ్డారు.

జమదగ్ని సురభిని ప్రార్థించగా, ఆ ధేనువు రోమకూపాలనుండి సైనికులు రథారూఢులై వచ్చి కార్తవీర్యార్జుని సైనికులను హతమర్చారు. అప్పుడు కార్తవీర్యార్జునుడే స్వయంగా వచ్చి ఇరవై సార్లు ఓడిపోయాడు. ఇరవైఒకటవసారి కార్తవీర్యార్జునుడు వచ్చి జమదగ్నిని సంహరించి సురభికోసం వెదుకగా, ఆ కామధేనువు ఇంద్రుని వద్దకు చేరింది. రేణుకాదేవి భర్తతో సహగమనానికి సిద్ధపడగా ఆకాశవాణి ఆమెను వారించింది. ఇంతలో భృగు మహర్షి వచ్చి జమదగ్నిని బ్రతికించాడు.

పరశురాముడు జరిగిన సంగతిని తెలిసికొని కోపించి, తండ్రి అనుమతితో కార్తవీర్యార్జునునిపై దండెత్తి, అతని వేయి చేతులను ఖండించి, గండ్రగొడ్డలితో అతని శిరస్సును ఖండించాడు. ఈ సంగతి తన తండ్రికి తెలుపగా, "రాజు ఎంత దుష్టుడైనా అతనిని చంపటం దోషం" అని చెప్పి దోష పరిహారార్థం తీర్థయాత్ర చేయమని చెప్పాడు. పరశు రాముడు తీర్థయాత్రకై వెడలిపోయాడు. కార్తవీర్యార్జునుడు తనకు పరమ విరోధియైనా అతనిని చంపిన విష్ణాంశసంభూతుడైన పరశు రాముని ధర్మ హిత బుద్ధితో పుత్రుని శిక్షించటానికి వెనుకాడని జమదగ్నిని ఎంత కొనియాడినా తనివి తీరదు.

-సశేషం

# సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

## కవిగారు - పోతునూరు

ఇక శ్రీబాబు విషయం చెప్పనవసరంలేదు.తాము మేరునగ ధీరులైన మహోన్నతులని, సాక్షాత్ పరమేశ్వర స్వరూపులని అందరికీ తెలిసినా, తాము ఒక ప్రత్యేకతను చూపించుకొనక, దూర దూరంగా భయం భయంగా ఉండేవారిని కూడా ఏదో ఒక చల్లని పలకరింపుతోనో, ఒక అల్లరి చేష్టతోనో, ఒక మధుర మందహాసంతోనో, కొంటెతనంతోనో, గోముగానో, ఉట్టిపడే వినయ వినమ్రతలతోనో, ఏవేవో జ్ఞాపకాలు తెప్పించో, ఏవేవో వ్యాపకాలు ముచ్చటించో అందరి మనస్సులను పూర్తిగా గెలుచుకుని, తమవిగా చేసుకునేవారు శ్రీబాబు. ఈ ఊళ్ళోనే కాదు, ఎక్కడ ఏ ఊళ్ళో ఉన్నా, భక్తులందరిని ఇలాగే రప్పించుకుని, అలనాటి బృందావన సీమలలో గోప గోపీమణులకు అందించిన ఆనందాన్ని మళ్ళీ అందరికీ అందించేవారు. అది అందుకున్న వారందరూ అపురూప భాగ్యశాలురు. సూక్ష్మంగా



చెప్పవలెనంటే, ఏ భక్తుడైనా శ్రీ బాబుతో తాను పొందిన దర్శన, వందన, సంభాషణ, సాన్నిహిత్య సన్నివేశాలను నిరంతరము స్మరిస్తూ మనసా పునశ్చరణ చేసుకుంటే చాలు, అదే అతనికి సర్వ సాధనల ఫలితాన్నీ సమకూర్చి, శ్రీ బాబు సాయుజ్యాన్ని పొందించగలదు. అలా శ్రీ గురు సాయుజ్యం పొందిన భక్తులెందరో ఉన్నారు.

అంతేకాదు; శ్రీ బాబు మనకీనాడు భౌతికంగా కనిపించక పోయినా, మెలుకువలోను, నిద్రలోను, స్వప్నంలోనూ కూడ స్వామి సాన్నిహిత్యాన్ని అనుభవిస్తూ, స్వామితో మాట్లాడుతూ, స్వామి మాటలను వింటూ, స్వామి ఆదేశాలను అందుకుని ఆచరించుకుంటూ ఆనందాన్ని ఈనాటికీ పొందుతున్న భక్తులు మన దేశంలోను, యితర దేశాలలోను, ఎందరెందరో ఉన్నారు.

శ్రీ బాబు పూజాపీఠంతో వచ్చి రాఘవరావుగారింట్లో ఉన్న అన్ని రోజులూ శ్రీబాబు పూజకు కావలసిన ఏర్పాట్లన్నీ వేణు చేసేది. శ్రీబాబు ఆమెకు పూలదండలు గుచ్చటం దగ్గరనుంచి అన్నీ నేర్పారు "భక్తులెందరు

వచ్చినా, ఎప్పుడెప్పుడు వారెవరెవరికి ఏమేమి కావాలో తెలుసుకుని అందించి, ఏసేవ చేసినా భగవదర్పితంగా చేసుకుంటే ఆ సేవలన్నీ నాకు అందుతా"యని శ్రీ బాబు చెప్పారు. వేణు రాఘవరావుగారింట్లోనే వుంటూ, శ్రీబాబుకు, అతిధులకు, రాఘవరావు దంపతులకు (తాతయ్య, అమ్మమ్మ) కూడ సహాయం చేస్తూ ఉండేది. రాఘవరావుగారికి సంతతి లేని లోటు తీర్చటానికి వారి తమ్ముడి కుమారుడైన పూర్ణ నాగేశ్వరశర్మను శ్రీబాబు వారికి దత్తత చేయించారు.

శ్రీ బాబు పోతునూరులో ఉన్నప్పుడు, కాలక్షేపానికి కవిగారితో "పులి, మేక" ఆట ఆడేవారు. "కవిగారూ! ఎవరు గెలుస్తారో చూద్దాం"అనేవారు. "పులి, మేక రెండూ మీరే కదా బాబూ! ఆ రెండే ఏమిటి? ఈ ఆడే ఉపాధులన్నీ మీరు ఆడిస్తే ఆడే బొమ్మలే కదా? ఇక గెలిచేది మీరుగాక మరెవరుంటారు?" అనేవారు.

కవిగారి పూర్వవృత్తాంతము, వారిపై ప్రయోగం జరగటం, శూలినీదుర్గా మంత్రోపాసనతో నివారించుకోవటం, తమ ప్రతిభను చూచి ఓర్వలేక ఎవరైనా మళ్ళీ ప్రయోగం చేయవచ్చుననే భయంతో, శక్త్యుపాసన ద్వారా శక్తులు సంపాదించాలని ప్రయత్నించటం, అన్నీ శ్రీబాబు విని "జరిగింది మంచిదే. ఇక మీరు ఆ మంత్రములను, ఆ మంత్రానుష్ఠానములను నాకు వదిలిపెట్టి, చక్కగా జగన్మాత దివ్యస్మరణతోను, పరమేశ్వరుని కథాగానములతోను, కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. మీకెవరివలనా యే ఆపదా రాకుండా నేను చూసుకుంటాను. ఏ సమయంలో మీకు ఏ భయం కలిగినా, నన్ను స్మరించుకోండి. మీకు ఎట్టి ఆపదా కలుగదు" అని అభయమిచ్చారు. కాని కవిగారు భయం భయంగానే ఉండేవారు.

అలాగే, ఒకప్పుడు కవిగారు హరికథ చెబుతుండగా, ఉన్నట్లుండి గొంతు పట్టుకునిపోయింది. ఒకక్షణం దిక్కుతోచని కవిగారికి శ్రీబాబు మాట జ్ఞాపకం వచ్చి, వెంటనే మనసారా శ్రీ బాబును స్మరించుకొన్నారు. మరుక్షణమే వారి గాత్రము యితోధిక మనోహరంగా పలకటం మొదలు పెట్టింది. ఆ నిదర్శనంతో కవిగారికి శ్రీ బాబు యెడల పరిపూర్ణ విశ్వాసం కుదిరింది. "అలా కవిగారిని శక్త్యుపాశన ప్రయత్నం నుండి విరమింపజేయటానికి నాకెనిమిదేళ్ళు పట్టింది" అన్నారు శ్రీ బాబు.

- సశేషం

## విష్ణు  కథలు

# సూరదాస్

- రమణ ప్రసాద్

-గత సంచిక తరువాయి

మనం గుర్తుపట్టనంతవరకు భగవంతుడు మన దాపుననే వుంటాడు. ఒక్కసారి గుర్తుపట్టామా! ఇంక మనకు చిక్కడు. అదే అయింది. అంతే అతని చేయి విడిచి ఘల్లు ఘల్లుమనే అందెల రవళితో పరిగెత్తుకుంటూ పోయాడు.



సూరదాసుకు వెంటనే తెలిసింది ఆ వచ్చింది తన శ్యామసుందరుడేనని. ఎవరి దర్శనానికై తను పరితపిస్తున్నాడో అతను ఇంత దగ్గరకు వచ్చి తనను సురక్షితంగా చేర్చి పలకరించేసరికి మాయమైనాడు. దుఃఖం పెల్లుబికి వచ్చింది. అప్పడు సూర్‌దాస్ అంటాడు-

హాథ్ ఛోడ్‌కే జాత్‌హో నిబల్ జానికె మోహే।
హృదయ ఛోడకే జావోతో సబల్ జానూ తోహే॥

"శ్యామ సుందరా! నా చెయ్యి విదిలించుకుని వెళ్ళిపోయావు. ఎందుకని నేను నిర్బలుడననేగా! కాని నువ్వు నా హృదయాన్ని విడిచి వెళ్ళగలవా? నీవు సబలుడవైతే నా హృదయ మందిరాన్ని విడిచి పెట్టు చూస్తాను" అని సవాలు చేశాడు.

శ్రీ బాబూజీ మహరాజ్ వారు సూరదాస్‌ను గురించి ఇలా చెప్పారు -

" శ్యామ సుందరుడు సూరదాస్‌కు పరిచర్యలు చేయటం మొదలు పెట్టాడు. రోజూ సూరదాస్‌కి ముఖం కడుగుతాడు, స్నానం చేయిస్తాడు, తన చేతితో అన్నం తినిపిస్తాడు. సూరదాస్ చిడతలు పట్టుకొని గానం చేస్తుంటే ఎదురుగా బాసీపట్టు వేసుకు కూర్చుని తాను కూడా ఆ గాన మాధుర్యాన్ని ఆస్వాదిస్తాడు - అది అతని దినచర్యగా మారింది.

ఒకరోజు సూరదాస్ పాడుతున్నాడు. అతని మనస్సు నిండా శ్యామసుందరుని రూపం నిండి ఉన్నది.

గిరిధర్ వ్రజ్‌ధర మురళీధర్ ధర
ధరణీ ధర మాధవ పీతాంబర ధర ॥
సీస్ మకుట ధర గోప వేషధర
కర ధర కమలా పుష్ప సారంగ ధర
కంబు కంఠ ధర కౌస్తుభ మణిధర ।
వనమాలా ధర ముక్త మాల ధర
దుష్ట కంస్‌కే కేశ పాశ ధర
సూరదాస ప్రభు కృష్ణ చరణ ధర ॥

సూరదాసు గిరిధరుడిని చూస్తూ ఇలా వర్ణిస్తున్నాడు................

"వ్రజధామంలో గిరిధరుడు మురళిని తన పెదవులపై ఉంచుకొని మురళీ గానం చేస్తున్నాడు. ఆయన ధరణీ ధరుడు, మాధవుడు. పీతాంబరధారి అయి శిరస్సు మీద మకుటం ధరించి గోప వేషం ధరించి ఉన్నాడు. ఒక చేతిలో కమలం ధరించాడు. రెండవ చేతిలో చక్రం ధరించాడు. ఆయన సన్ననైన కంఠాన్ని కౌస్తుభమాల అలంకరిస్తోంది. మెడలో ముక్తమాల ప్రకాశిస్తోంది. రాక్షస సంహారానికై ఉద్భవించిన కృష్ణుడు దుష్ట కంసుని కేశపాశాన్ని చేతిలో పట్టుకుని అతనిని మృత్యు ముఖానికి పంపుతున్నాడు. అట్టి మృదు మృదుల చరణాలను సూరదాసు పట్టుకొని ఉన్నాడు." అని పాడుతున్నాడు.

\- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL